ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


5




13న కలెక్టరేట్‌లో పీజీఆర్‌ఎస్ రద్దు

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని (పీజీఆర్ఎస్) ఈ నెల 13వ తేదీన రద్దు చేసినట్టు డీఆర్‌ఓ సత్యనారాయణరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భోగి పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు దినం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. రానున్న సోమవారం అర్జీలు అందజేయడానికి ప్రజలెవరూ కలెక్టరేట్‌కు రావద్దని కోరారు.

భక్తిశ్రద్ధలతో ముక్కోటి ఏకాదశి



ఉత్తర ద్వారంలో సింహాచలం వరాహ లక్ష్మీనారసింహస్వామి



ఉపమాక క్షేత్రంలో శ్రీరంగనాథుని అవతారంలో ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిస్తున్న స్వామివారు (ఇన్‌సెట్‌లో) ఆలయంలో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు



వైకుంఠవాసునిగా సింహాచలేశుడు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన స్వామి

- తొలి దర్శనం చేసుకున్న ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు
- తెల్లవారుజాము నుంచే బారులు తీరిన భక్తులు

సింహాచలం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి సందర్భంగా సింహాచలంలోని వరాహ లక్ష్మీనారసింహస్వామి శుక్రవారం భక్తులకు వైకుంఠవాసుడిగా దర్శనమిచ్చారు. స్వామివారిని శుక్రవారం తెల్లవారుజామున ఒంటిగంటకే సుప్రభాతసేవతో మేల్కొలిపి ధూప సేవ, నిత్యహోమం వంటివి పూర్తిచేశారు. ఆలయ అలంకారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని సకల ఆభరణాలతో అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తిని ఏడు మేలి ముసుగుల మధ్య ఉంచి, ఉభయ దేవేరులతో అధిష్ఠింపజేశారు. పండితుల వేద మంత్రోచ్చరణలు, నాదస్వరాలపనలు, భక్తుల గోవిందనామస్మరణ నడుమ బేడా మండప తిరువీధి నిర్వహించారు. ఆ మార్గంలో పూజలు చేసి, ఒక్కో ముసుగును తొలగించారు. ఆలయ ఉత్తర ద్వారంలో ఆఖరి ముసుగును తొలగించి భక్తులకు వైకుంఠవాసుడిగా దర్శనాన్ని కల్పించారు. తిరువీధిలో స్వామి పల్లకిని ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు, పలువురు ఎమ్మెల్యేలు, దేవస్థానం ఈఓ త్రినాథరావు మోశారు. ఉత్తర ద్వారంలో అశోక్‌గజపతిరాజు కుటుంబసభ్యులకు తొలి దర్శనం కల్పించారు. తరువాత స్వామి వారిని ఉత్తర రాజగోపురంలో పుష్పాలతో తీర్చిదిద్దిన వేదికపై ఉంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం 11.30 గంటల వరకు వేలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని, పూజలు చేశారు. అనంతరం సింహగిరి మాడవీధుల్లో తిరువీధి నిర్వహించారు.

ఉత్తర ద్వారంలో ఉపమాక వెంకన్న

శ్రీరంగనాథుడి అవతారంలో భక్తులకు దర్శనం

- గోవిందనామ స్మరణతో మార్మోగిన ఆలయం

నక్కపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా జిల్లాలో అతి ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం శుక్రవారం భక్తజనసంద్రంగా మారింది. ఉపమాక వెంకన్నను ఉత్తరద్వారం నుంచి దర్శించుకోవడానికి తెల్లవారుజాముకే వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయంలోని క్యూ లైన్లన్నీ కిటకిటలాడాయి. భక్తుల గోవిందనామ స్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. ముక్కోటి ఏకాదశి సందర్భంగా తెల్లవారుజామున మూడు గంటలకు కొండపై వున్న ఆలయంలో స్వామివారి నిజరూపానికి అర్చకులు పంచామృతాభిషేకం చేసి, ధూప, దీప నైవేద్య నీరాజన మంత్రపుష్పాలు సమర్పించిన అనంతరం భక్తుల దర్శనాలకు అనుమతిచ్చారు. కింద ఆలయంలో స్వామివారి ఉత్సవమూర్తిని శేషతల్పంపై పవళిస్తున్నట్టు, ఆయన పాదాల చెంత శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ఉంచి ఉత్తరద్వారం గుండా భక్తులు దర్శించుకునేలా ఏర్పాట్లు చేశారు. పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు ఆలయాన్ని దర్శించుకున్నారు. నర్సీపట్నం డీఎస్పీ మోహన్, నక్కపల్లి సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు పర్యవేక్షణలో ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.



అనకాపల్లిలో..

స్థానిక దేమునిగుమ్మం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి వేకువజామున రెండున్నర గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనం కల్పించారు. అప్పటికే భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి వచ్చి బారులు తీరారు. శుక్రవారం రాత్రి ఆలయం మూసే వరకు భక్తుల తాకిడి కొనసాగింది. పలువురు ప్రజాప్రతినిధులు, రాజకీయ నేతలు, అధికారులు ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఉత్తర ద్వారంలో దర్శనమిస్తున్న ఉత్సవమూర్తులు

పల్లె రోడ్లకు కొత్త రూపు

గ్రామాల్లో చకచకా సిమెంట్ రహదారుల నిర్మాణం

- ఆర్‌అండ్‌బీ రోడ్లపై గుంతలు పూడ్చివేత
- సంక్రాంతినాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యం



గొలుగొండ మండలం ఏటిగైరంపేటలో నిర్మించిన సీసీ రోడ్డు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

గ్రామీణ ప్రాంతాలకు సంక్రాంతి పండుగ ముందే వచ్చింది. ఏళ్ల తరబడి అధ్వానంగా ఉన్న గ్రామీణ రహదారులు కూటమి ప్రభుత్వం పుణ్యమా అని బాగుపడుతున్నాయి. సంక్రాంతి పండుగనాటికి గుంతలు లేని రోడ్లు ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అంతేకాక రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. దీంతో జిల్లాలో రహదారుల నిర్వహణ, అభివృద్ధి పనులు చకచకా సాగుతున్నాయి. ఆర్‌అండ్‌బీ రోడ్లపై గుంతలు పూడ్చడంతోపాటు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కన్వర్జెన్సీ నిధులతో (60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం) గ్రామాల్లో సీసీ రోడ్లు వేస్తున్నారు. వివిధ గ్రామాల్లో 148 కిలోమీటర్ల పొడవున సిమెంట్ రోడ్లు వేసేందుకు ప్రభుత్వం 1,372 పనులు మంజూరు చేసింది. ఇప్పటికే 1,102 పనులు ప్రారంభమయ్యాయి. పలు గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణాలు పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. మిగిలిన పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇప్పటి వరకు సిమెంట్ రోడ్ల పనులకు రూ.11 కోట్లు ఖర్చు చేశామని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ పూర్ణిమాదేవి తెలిపారు. గతంలో మంజూరైన రోడ్ల పనులను త్వరగా పూర్తి చేసి, కొత్తగా మరిన్ని రోడ్లు మంజూరు చేస్తామని ఆమె తెలిపారు.



వెంకన్నపాలెం- సబ్బవరం ఆర్‌అండ్‌బీ రోడ్డులో గోతులు పూడ్చివేత పనులు

చెరకు పిప్పితో ఎరువు

శాస్త్రీయ పద్ధతిలో కాల్చి... బొగ్గుగా మార్పు

- పంట పొలాల్లో వినియోగం
- భూసారం పెంపు, నేలలో తేమను పట్టి ఉంచేందుకు దోహదం
- అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు పరిశోధన
- త్వరలో చెరకు రైతులకు అందుబాటులోకి పరికరం



చెరకు పిప్పి



బయోచార్‌గా తయారైన చెరకు పిప్పి

అనకాపల్లి అగ్రికల్చర్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): **బెల్లం తయారీ కోసం చెరకు గడల నుంచి రసం తీసిన తరువాత వచ్చే పిప్పిని రైతులు కాల్చివేస్తుంటారు. దీనివల్ల ఎటువంటి ప్రయోజనం ఉండకపోగా, పర్యావరణ కాలుష్యం పెరుగుతుంది. అయితే చెరకు పిప్పిని శాస్త్రీయ పద్ధతిలో కాల్చి, బొగ్గుగా మార్చవచ్చునని అనకాపల్లిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు చెబుతున్నారు. చెరకు పిప్పితో తయారుచేసిన బొగ్గు భూసారాన్ని పెంచేందుకు, నేలలో తేమను పట్టి ఉంచేందుకు దోహదపడుతుదని తెలిపారు. చెరకు పిప్పితోపాటు విత్తనాలు వలిచిన మొక్కజొన్న కండెలు, ఎండిన కొబ్బరి చిప్పలను కూడా బొగ్గుగా మార్చవచ్చు. దీనిని బయోచార్‌గా పిలుస్తున్నారు. బయోచార్ ప్రక్రియను ప్రమాణీకరించి త్వరలోనే రైతులకు అందుబాటులోకి తేనున్నారు.**

అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, చోడవరం, ఎలమంచిలి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో పలువురు చెరకు రైతులు బెల్లం తయారుచేస్తుంటారు. చెరకును గానుగాడించి రసం తీసిన తరువాత పిప్పి వస్తుంది. చెరకులో అధికంగా ఉండే ఫాస్ఫేట్..క్రషింగ్ తర్వాత పిప్పిలో కొంత మిగిలి ఉంటుంది. ఆ పిప్పిని బొగ్గుగా (బయో చార్) మార్చి పంటలకు అందించవచ్చు. బయోచార్‌లోని కార్బన్, నేలలోని కార్బన శాతాన్ని గణనీయంగా పెంచుతుంది. నేలలో కార్బన్ ఎంత అధికంగా ఉంటే పంటలకు అంత ఎక్కువ మేలు చేకూరుతుంది. బెల్లం తయారీ ముగిసిన తరువాత రైతులు చెరకు పిప్పిని పొలంలో వేసి నిప్పుపెడుతుంటారు. దీనివల్ల నేలకు పెద్దగా ఉపయోగం ఉండకపోగా, కాలుష్యం పెరుగుతుంది. అలాగే చెరకు పిప్పిని కాల్చిన ప్రదేశంలో పంటలకు మేలు చేసే పురుగులు, సూక్ష్మ జీవులు నశిస్తాయి. చెరకు పిప్పిని కాల్చకుండా, దానిని బొగ్గుగా (బయోచార్) మార్చి, పంట పొలాలకు ఉపయోగపడేలా అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు పరిశోధనలు చేశారు.

బయోచార్ తయారీ విధానం

చెరకు పిప్పిని బయోచార్‌గా తయారుచేయడం చాలా సులువు. పిప్పిని పైరోలిసిస్ పద్ధతిన మండించి, అది పూర్తిగా కాలి బూడిద కాకుండా బొగ్గుగా మారుస్తారు. ఇందుకోసం ఒక పెద్ద డ్రమ్‌కు అడుగు భాగాన ... మిగతా 8వ పేజీలో



డ్రమ్ముల్లో కాలుతున్న చెరకు పిప్పి

టెన్త్‌లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం రెండు గంటలపాటు ప్రత్యేక తరగతులు



కశింకోట ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

- చదువులో వెనుకబడిన విద్యార్థులపై అధిక శ్రద్ధ
- ప్రతి ఆదివారం రెండు సబ్జెక్టులపై స్టడీ, ఎగ్జామ్
- జిల్లాలో 107 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు
- 'ఆంధ్రజ్యోతి'తో డీఈఓ గిడ్డి అప్పారావు నాయుడు



అప్పారావు నాయుడు, డీఈఓ

అనకాపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని జిల్లా విద్యా శాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. మరో రెండు నెలల్లో పబ్లిక్ పరీక్షలు జరగనుండడంతో విద్యార్థులను సమాయత్తం చేయడం, శత శాతం ఉత్తీర్ణత సాధనకు తీసుకుంటున్న చర్యల గురించి శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి వివరించారు. మండలం విద్యా శాఖాధికారులు, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో మండలస్థాయి కమిటీలను ఏర్పాటు చేసి పదో తరగతి విద్యార్థుల పురోగతి గురించి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని డీఈవో చెప్పారు. గత ఏడాది జిల్లాలో 89 శాతం ఉత్తీర్ణత సాధించగా ఈ ఏడాది నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ప్రణాళికను అమలు చేస్తున్నట్టు తెలిపారు. అన్ని సబ్జెక్టుల్లో ఇప్పటికే సిలబస్ పూర్తి చేసి రివిజన్, ప్రాక్టీస్ టెస్ట్‌లు నిర్వహిస్తుమన్నారు. అన్ని పాఠశాలల్లో చదువులో కొంతమేర వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారిపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని చెప్పారు. అన్ని ఉన్నత పాఠశాలల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచి తొమ్మిది గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు 'పది' విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్టు వెల్లడించారు. ప్రతి ఆదివారం రెండు సబ్జెక్టులపై ఉదయం నుంచి సాయంత్రం వరకు చదివించి అదే రోజు సాయంత్రం పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. స్టేట్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ సెంటర్ నుంచి పాఠశాలలకు వచ్చిన మోడల్ పేపర్స్, ప్రశ్నాపత్రాలను విద్యార్థులకు అందించి ప్రాక్టీస్ చేయిస్తున్నామని, జిల్లా కామన్ ఎగ్జామినేషన్ బోర్డు కమిటీ రూపొందించిన స్టడీ మెటీరియల్ పుస్తకాలను విద్యార్థులకు అందించి చదివిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో 107 కేంద్రాల్లో ఈ ఏడాది మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతాయని, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 21,002 మంది విద్యార్థులు హాజరు కానున్నారని డీఈవో అప్పారావునాయుడు తెలిపారు.

శభాష్ అమేయ

- 'నేషనల్ యూత్ ఐకాన్' అవార్డుకు ఎంపిక
- శాస్త్రీయ నృత్యంలో రాణిస్తున్న బాలిక
- 2021లో ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్..



లగుడు అమేయ (ఫైల్ ఫొటో)

రోలుగుంట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిండుగొండ గ్రామానికి చెందిన శాస్త్రీయ నృత్య కళాకారిణి లగుడు అమేయ 'నేషనల్ యూత్ ఐకాన్' అవార్డుకు ఎంపికయ్యింది. ఈ నెల 12వ తేదీన న్యూఢిల్లీలో జరగనున్న కార్యక్రమంలో అవార్డును స్వీకరించనున్నది. ప్రస్తుతం విశాఖలోని ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్న లగుడు అమేయ.. నాలుగేళ్ల వయసులోనే కాలిక గజ్జె కట్టి నాట్యంలో అరంగేంట్రం చేసింది. ఆరేళ్ల వయసులో రెండున్నర గంటపాటు ఏకధాటిగా నృత్య ప్రదర్శన చేసి అబ్బురపరిచింది. అనంతరం దేశ, విదేశాల్లో వందలాది ప్రదర్శనలు ఇచ్చింది. 2021లో ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్‌కు ఎంపికైంది. తాజాగా 'నేషనల్ యూత్ ఐకాన్' అవార్డు వరించింది. దేశవ్యాప్తంగా వ్యాపారం, సామాజిక సేవ, క్రీడలు, విద్య, ఆరోగ్యం, మానవ హక్కులు, శాంతి, యువత సాధికారత, వినోదం, దాతృత్వం, కళలు వంటి విభిన్న రంగాల్లో విశేష ప్రతిభ చూపుతున్న 30 మంది యువతీ యువకులను ఈ అవార్డుకు ఎంపికచేయగా, వీరిలో అమేయ ఒకరు కావడం విశేషం.

బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడి అరెస్టు

80 రోజుల తరువాత పట్టుకున్న పోలీసులు

- పోక్సో, అత్యాచారం, బాల్య వివాహాల నిరోధక చట్టం కింద కేసులు నమోదు
- బాలిక పెద్దమ్మ కుమారుడు సహకారం
- వాళ్ల ఇంటిలో నుంచి 30 తులాల బంగారు నగలు తస్కరణ



విలేకరుల సమావేశంలో డీఎస్పీ కేవీ సత్యనారాయణ, ముఖానికి ముసుగు కట్టిన వ్యక్తి నిందితుడు పతివాడ మహేశ్

సబ్బవరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): బాలికను కిడ్నాప్ చేసి, సుమారు మూడు నెలల నుంచి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని శుక్రవారం పోలీసులు అరెస్టు చేశారు. బాలికను అపహరించేందుకు స్వయంగా ఆమె పెద్దమ్మ కొడుకే నిందితుడికి సహకరించడం విశేషం. ఇందుకు సంబంధించి పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ శుక్రవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు.

సబ్బవరం మండలం గంగవరం (జీవీఎంసీ పరిధి) గ్రామానికి చెందిన తమ కుమార్తె (14) కనిపించడం లేదంటూ తల్లిదండ్రులు గత ఏడాది అక్టోబరు 21వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదృశ్యంగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పతివాడ మహేశ్ అనే వ్యక్తి (విజయనగరం పట్టణంలోని సాలిపేటకు చెందిన ఇతను కొంతకాలం నుంచి గంగవరంలో ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు) బాలికను బైక్‌పై తీసుకుపోయినట్టు సీసీ కెమెరాల ఫుటేజీ ద్వారా గుర్తించారు. అనంతరం అదృశ్యం కేసును కిడ్నాప్ కేసుగా మార్చారు. నిందితుడి బంధువులు, స్నేహితుల ... మిగతా 8వ పేజీలో

'పంట కాలువలను ఆక్రమిస్తే చర్యలు'

మునగపాక, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సాగుకు జీవనాధారమైన పంట కాలువలను స్వార్థ ప్రయోజనాల కోసం కప్పితే చట్టపరమైన చర్యలు తప్పవని నీటి పారుదల శాఖాధికారులు హెచ్చరించారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఎదురుగా ఉన్న పంట కాలువ ఆక్రమణకు గురికావడంతో స్థానిక రైతులు పలు శాఖలు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం ఇరిగేషన్, రెవెన్యూ, పోలీసు శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పంటకాలువలను కప్పివేసిన వాటిని జేసీబీ ద్వారా తొలగించారు. అనుమతులు లేకుండా పంట కాలువల్లో ఎటు వంటి పనులు చేపట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాయగరువులో హెరిటేజ్ పాల సేకరణ కేంద్రం



పాల సేకరణ కేంద్రం ప్రారంభోత్సవంలో మేనేజర్ శేషు తదితరులు

అచ్యుతాపురం రూరల్, జనవరి 10, (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొప్పెర్ల శివారు రాయగరువులో శుక్రవారం హెరిటేజ్ డెయిరీ పాల సేకరణ కేంద్రాన్ని డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీ అందిస్తున్న సేవలను పాడి రైతులు సద్విని యోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద కొల్లి సన్ని బాబు, కె.వెంకటరావు, కె.వరలక్ష్మి, పి.రమణమ్మ, కె.దేవి, ఎం.సన్యాసిరావు, కె.నాగ రాజు తదితరులు పాల్గొన్నారు.

వరి సాగులో శాస్త్రీయ పద్ధతులు శ్రేయస్కరం

మునగపాక, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : వరి సాగులో రైతులు శాస్త్రీయ పద్ధతులను పాటించడం శ్రేయస్కరమని అనకాపల్లి ప్రాం తీయ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రామారావు అన్నారు. వాడ్రాపల్లిలో డ్రమ్ సీడర్‌తో వేసిన వరినారును శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోతాదులకు మించి రసాయన ఎరు వులు వేయడం మంచిది కాదన్నారు. వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు, సలహాలకు అనుగుణంగా సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చున న్నారు. మండల వ్యవసాయాధికారిణి సిహెచ్.జ్యోత్స్నకుమారి, ఏఈవో లక్ష్మి, వీహెచ్‌ఏ తులసి తదితరులు పాల్గొన్నారు.

నాయుడుబాబుకు కన్నీటి వీడ్కోలు

▸▸ అంత్యక్రియలు నిర్వహించిన అన్న

నర్సీపట్నం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాటలో మృతి చెందిన నాయుడుబాబుకి శుక్రవారం కన్నీటి వీడ్కోలు పలికారు. అతనికి అన్న బీవీ రమణ అంత్యక్రియలు నిర్వహించారు. తిరుపతిలో శ్రీవారి వైకుంఠ ఏకాదశి దర్శనం టోకెన్లు జారీ కౌంటర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో పెదబొడ్డేపల్లి బీసీ కాలనీకి చెందిన బొడ్డేటి నాయుడుబాబు మృతి చెం దిన విషయం తెలిసిందే. గురువారం సాయంత్రం తిరుపతి నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో మృతదేహాన్ని పెదబొడ్డేపల్లి తరలించారు. శుక్రవారం ఉదయానికి అంబులెన్స్‌పెదబొడ్డేపల్లి చేరుకుంది. మృతిని అన్న, విశ్రాంత ఎంఈవో బీవీ రమణ కుమారుడు రఘ అమెరికా నుంచి పినతండ్రి కడసారి చూపుకోసం హుటాహుటిన బయలుదేరి వచ్చారు. చిన్నాన్న మృతదేహాన్ని చూసిన రఘు కన్నీరుమున్నీరుగా విలపించారు. భార్య మణికుమారి, కుమార్తె సునీత, బంధువులు దుఃఖసాగరంలో మునిగిపోయారు. వెంకన్న భక్తుడైన నాయుడుబాబు తిరుపతి వెళ్లి స్వామి సన్నిధిలో చనిపోవడం, వైకుంఠ ఏకాదశి రోజున అంత్యక్రియలు జరగడంపై అందరూ విశేషంగా మాట్లాడుకున్నారు.



ఎలమంచిలిలో వెంకన్నను దర్శించుకుంటున్న భక్తులు



అచ్యుతాపురం వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల పూజలు



రాంబిల్లి వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తుల భజనలు

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి

▸▸ దేవదేవుని ఆలయాల్లో వేకువజాము నుంచి పూజలు ▸▸ ఉత్తర ద్వారం నుంచి స్వామివారు దర్శనం

ఎలమంచిలి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని నియోజకవర్గ ప్రజలు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందులో భాగంగా దేవదేవుని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎలమంచిలి పట్టణంలోని బస్టాండ్ సమీపంలో కొమ్మాయి గుండం వద్ద శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అదే విధంగా శ్రీరామచంద్రమ్మ కొండపై ఉన్న వేంకటేశ్వ ఆలయంలో ఈ వేడుకలను మరింత ఘనంగా నిర్వహిం చారు. కొత్తపేట పురాతన సీతారాముల ఆలయం, పీఎస్ఆర్ పేట, ఏటికొప్పాక, పులపర్తి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో స్వామిని విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. నిర్వాహకులు విస్తృత ఏర్పాట్లు చేపట్టారు.

అచ్యుతాపురం రూరల్ : మండలంలోని అచ్యుతాపురం, నునపర్తి, హరిపాలెం తదితర గ్రామాల్లోని ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పూజలను ఘనంగా నిర్వహించారు. నునపర్తిలో మూలవిరాట్‌కు పంచామృత అభిషేకాలు జరిపారు. ఆలయాల్లో స్వామి ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిచ్చారు.



మునగపాకలో ఉత్తర ద్వారం నుంచి దర్శనమిస్తున్న స్వామివారు

మునగపాక : మండలంలోని పలు గ్రామాల్లో వైకుంఠ ఏకాదశి పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నాగులాపల్లిలో గల స్వయం భూ వేంకటేశ్వరస్వామిని ఉత్తరద్వారం గుండా భక్తులు దర్శించుకున్నారు. తొలుత స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధుల్లో ఊరేగించారు. అలాగే, మునగపాక, వాడ్రాపల్లి, పాటిపల్లి, చూచుకొండ, అరబుపాలెం తదితర గ్రామాల్లో ఈ వేడుకలు మరింత ఘనంగా జరిగాయి. ఆలయాల నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు.

రాంబిల్లి : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని మండల వ్యాప్తంగా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రధానంగా రాంబిల్లి పెద్ద రామాలయంలోని వేంకటేశ్వరసన్నిధిలో ఈ పూజలు మరింత ఘనంగా జరిగాయి. తొలుత స్వామివారిని విశేషంగా అలంకరించిన అనంతరం అర్చకులు పూజలు నిర్వహించారు. ఆ తరువాత భక్తులకు ఉత్తర ద్వారం నుంచి స్వామి వారి దర్శనభాగ్యం కల్పించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే మండలంలోని గ్రామ గ్రామాన గల దేవదేవుని ఆలయాల్లో ఈ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో అంతా జరుపుకున్నారు.

నేత్రపర్వంగా లక్ష్మీనృసింహస్వామి గిరి ప్రదక్షిణ

మునగపాక, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాటిపల్లి అహోబిల లక్ష్మీనృసింహస్వామి గిరి ప్రదక్షిణ శుక్రవారం ఘనంగా జరిగింది. భారీగా భక్తులు తరలి వచ్చారు. సాయంత్రం ఆలయం వద్ద నుంచి ప్రారంభమైన గిరి ప్రదక్షిణ మూలపేట, తోటాడ, నారాయుడుపాలెం గ్రామాల మీదుగా కొనసాగింది. ఈ వేడుకకు విచ్చేసిన భక్తులకు ఆయా గ్రామాలు ప్రధాన కూడళ్లలో బిస్కెట్లు, శీతలపానీయాలు, ప్రసాదాలు తదితరాలను దాతలు అందజేశారు. వేల సంఖ్యలో భక్తులు గిరి ప్రదక్షిణ చేయడంతో కోలాహల వాతావరణం నెలకొంది. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన రథంలో ఊరేగించారు. పలువురు ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు.



స్వామివారి ఉత్సవ విగ్రహం ఊరేగింపులో పాల్గొన్న భక్తజనం

గృహ నిర్బంధాలపై సీపీఎం నాయకులు ఆందోళన

రాంబిల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) :విశాఖ పర్యటనకు దేశ ప్రధాని నరేంద్రమోదీ వచ్చిన నేపథ్యంలో ముందస్తుగా పోలీసులు గృహ నిర్బంధాలు చేయడం అన్యాయమంటూ సీపీఎం నాయకులు బుధవారం మండల కేంద్రం రాంబిల్లిలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించలేదని, తిరిగి దీనిని ప్రైవేటీకరణకు కుట్ర పన్నుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడలో తిరస్కరించిన బల్క్‌డ్రగ్స్ కంపెనీని అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఎలా నెలకొల్పుతున్నారని ప్రశ్నించారు. పూడిమండకలో ఏర్పాటు చేయనున్న ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ పవర్ ప్లాంట్‌లో స్థానికులకు ఎన్ని ఉద్యోగాలు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాలుష్యంతో ఈ ప్రాంతాల ప్రజలు, కార్మికులు ఎంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే ఈ సమస్యపై స్పందించాల్సిందిగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

రహదారికి ఇరువైపులా తుప్పల తొలగింపు

రాంబిల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జడ్.చింతువా పంచాయతీ పరధి కొండవారపాలెం నుంచి ఎం.చింతువా గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించిన కంచి చెట్లను బుధవారం మాజీ సర్పంచ్ ఎరిపిల్లి చిట్టిబాబు తన సొంత నిధులు వెచ్చించి జేసీబీతో తొలగించారు. ఈ చెట్లు రహదారిని ఆ క్రమించడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ఇది గుర్తించిన చిట్టిబాబు సుమారు రెండు కిలోమీటర్ల మేర ఉన్న ఈ చెట్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పిల్లి సహదేముడు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఘనంగా సంక్రాంతి సంబరాలు

అచ్యుతాపురం రూరల్, జనవరి 10, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. భవానీ విద్యానికేతన్‌లో విద్యార్థినులు అందమైన ముగ్గులు వేశారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించారు. విశాఖ స్కూల్‌లో గంగిరెద్దుకు పూజలు నిర్వహించారు. అలాగే, మరిన్ని పాఠశాలల్లో ఈ వేడుకలను ఆనందోత్సాహాల నడుమ జరిపారు. భోగిమంట వేయగానే విద్యార్థుల ఆనందాలకు అవధులు లేవు. సంక్రాంతి విశిష్టతను ఉపాధ్యాయులు వారికి వివరించారు.



గంగిరెద్దుకు పూజలు నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఘనంగా వైకుంఠ ఏకాదశి

ఉత్తర ద్వార దర్శనానికి పోటెత్తిన భక్తులు

గరుడ వాహనంపై ఊరేగిన పాండురంగస్వామి

అలరించిన భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు

పాయకరావుపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాయకరావుపేట పట్టణంలోని రాధా రుక్మిణి సమేత పాండురంగస్వామి ఆలయంలో ప్రధానార్చకులు కృష్ణస్వామి, నారాయణా చార్యులు తెల్లవారుజామున స్వామివారికి ప్రత్యేక పూజలు అనంతరం 5 గంటలకు ఉత్తర ద్వార దర్శనం చేయించారు. తదుపరి స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేక మండపంలో ప్రతిష్ఠించి విశేష పూజలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, పాండురంగస్వామి దేవస్థానం మాజీ చైర్మన్లు ధనిశెట్టి బాబూరావు, యాళ్ల వరహాలబాబు, వైసీపీ నేత దగ్గుపల్లి సాయిబాబా, అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. లక్ష తులసి పూజ, లక్ష కుంకుమ పూజలో మహిళలు పాల్గొని తరించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లను గరుడవాహనంపై ప్రతిష్ఠించి మేళ తాళాల నడుమ పట్టణంలో తిరువీధి ఉత్సవం నిర్వహించారు. అలాగే రాజుగారిబీడులోని వెంకటేశ్వరస్వామి ఆలయం, సత్యవరం, పాల్తేరు, రాజగోపాలపురం గ్రామాల్లోని పలు ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి పర్వదిన వేడుకలు జరిగాయి. ఆలయాల్లో భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.





పాయకపరావుపేటలో దివ్యమూర్తులుగా పాండురంగస్వామి, అమ్మవార్లు... ఉపమాకకు కాలినడకన వచ్చిన శ్రీవారి సేవకులు

రెండు వేల మంది పాదయాత్ర

నక్కపల్లి: చినదొడ్డిగల్లు గ్రామంలో ధనుర్మాస సేవలు చేస్తున్న సుమారు రెండు వేల మంది భక్తులు ఉపమాక ఆలయానికి కాలినడకన తరలివచ్చారు. సుమారు ఎనిమిది కిలోమీటర్లు గోవిందనామస్మరణ చేస్తూ పాదయాత్రగా వచ్చారు. ఆలయ ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు, శ్రీనివాసాచార్యులు, సాయిగోపాలాచార్యులు, రాజగోపాలాచార్యులు పూజా కార్యక్రమాలు చేశారు. కాగా, వెంకన్న ఆలయానికి వచ్చిన భక్తులకు గ్రామానికి చెందిన సిద్దాబత్తుల కృష్ణ, ఆయన కుమారులు అన్న ప్రసాదాన్ని అందజేశారు.

ఎస్.రాయవరంలో...

ఎస్.రాయవరం: మండల కేంద్రంలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి ఏకాదశి పూజలు వైభవంగా జరిపించారు. ఉదయం నుంచి స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు ఆలయానికి తరలివచ్చి భక్తిశ్రద్ధలతో స్వామి వారికి పూజలు చేశారు. ఆలయ పండితులు భక్తులందరికీ వేంకటేశ్వరస్వామి ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. పుర వీధుల్లో వేంకటేశ్వర స్వామి వారి తిరువీధి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, ఆలయ ధర్మకర్త బొలిశెట్టి గోవిందరావు, ప్రజా ప్రతినిధులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్.రాయవరంలో వేంకటేశ్వరస్వామి తిరువీధి కార్యక్రమం

'టీడీపీ సభ్యత్వ నమోదుకు విశేష స్పందన'

పాయకరావుపేట రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొంది కాశీవిశ్వనాథం అన్నారు. రాజవరం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు ఆకర్షితులై అధిక సంఖ్యలో పార్టీలో చేరుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజవరం నీటి సంఘం అధ్యక్షుడు పిరమళ్ల గోవిందు, టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు యజ్జల గోవిందు తదితరులు పాల్గొన్నారు.

'దళితుల్లో చిచ్చు పెట్టడం దుర్మార్గం'

పాయకరావుపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల వర్గీకరణ తీసుకువచ్చి దళితుల మధ్య చిచ్చుపెట్టడం దుర్మార్గమని భీమ్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు రవి సిద్దార్థ అన్నారు. శుక్రవారం విశాఖ నుంచి విజయవాడ వెళుతున్న ఆయన స్థానిక తాండవ జంక్షన్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దళితులకు అన్యాయం జరిగితే ఊరుకోమని, ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భీమ్ సేన ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి నెలపర్తి అర్జున్, జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.దాసు, జిల్లా కార్యదర్శి ఎం.నాగరాజు, పట్టణ అధ్యక్షులు గుల్ల శివ, మండల అధ్యక్షుడు పి.నానాజీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీప్రకాష్‌లో సంక్రాంతి సంబరాలు



భోగి మంట నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పాయకరావుపేట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీప్రకాష్ విద్యా సంస్థల్లో శుక్రవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఈ కార్యక్రమంలో సంప్రదాయాలు, పల్లె వాతావరణాన్ని మరిపించే విధంగా, రైతులు పంటలు చేతికి వచ్చిన తరువాత వచ్చే సంక్రాంతిని ఏ విధంగా జరుపుకుంటారో విద్యార్థులు వివిధ ప్రదర్శనల ద్వారా కళ్ళకు కట్టినట్టుగా చూపించారు. విద్యార్థులు పట్టు చీరలు ధరించి భోగిమంటలు, సంప్రదాయ వంటకాలు, గొబ్బెమ్మలు, రంగుల ముగ్గులు, హరిదాసుల మధ్య ఆటపాటలతో సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ భానుమూర్తి, అకడమిక్ ఇన్‌చార్జి శ్రీలక్ష్మితో పాటు పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో సంక్రాంతి వేడుకలు

నక్కపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివయ్య ఆధ్వర్యంలో శుక్రవారం సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు కలిసి సంప్రదాయ వస్త్ర ధారణలో వేడుకలు జరుపుకున్నారు. అలాగే సంక్రాంతి ముగ్గులు, గొబ్బెమ్మలతో కళాశాల ప్రాంగణాన్ని ముస్తాబు చేశారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

రామాలయంలో ఏకాహం

నక్కపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక పల్లపువీధి రామాలయంలో ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి ఏకాహ భజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉపమాక శ్రీనివాసా భజన భక్త సమాజం నేతృత్వంలో సూరవరం, ఉపమాక మహిళా భజన సమాజాలు, నక్కపల్లి భజన సమాజం సభ్యులు భగవన్నామ సంకీర్తన, ఆధ్యాత్మిక గీతాలను ఆలపించారు. శని వారం ఉదయం 6 గంటలతో ఏకాహం ముగుస్తుందని కమిటీ ప్రతినిధులు చెప్పారు.

భక్తిశ్రద్ధలతో వైకుంఠ ఏకాదశి పూజలు

కిటకిటలాడిన వైష్ణవ దేవాలయాలు

వైకుంఠ ద్వార దర్శనానికి బారులుతీరిన భక్తులు

నర్సీపట్నం/చోడవరం/మాడుగుల/బుచ్చెయ్యపేట/మాడుగుల/ మాడుగల రూరల్/దేవరాపల్లి/గొలుగొండ/ కృష్ణాదేవిపేట/మాకవరపాలెం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశిని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో భక్తులు ప్రత్యేకంగా పూజలు చేశారు. భక్తులకు స్వామివారి ఉత్తరద్వార దర్శనం ఏర్పాటు చేశారు. నర్సీపట్నంలోని బలిఘట్టం సత్యనారాయణస్వామి ఆలయం, నర్సీపట్నంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో దర్శనానికి భక్తులు పోటెత్తారు. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అలాగే చోడవరంలోని కేశవస్వామి, ఆపద హర వేంకటేశ్వరస్వామి, గోవాడ, లక్క



చోడవరం ఆపదహర వేంకటేశ్వరస్వామి క్షేత్రం వద్ద బారులు తీరిన భక్తులు

వరం, జుత్తాడ గ్రామాల్లోని వేంకటేశ్వరస్వామి ఆలయాలు ఉదయం నుంచి భక్తులతో రద్దీగా మారాయి. ఆలయాల వద్ద శాంతారామాచార్యులు, సుదర్శన సీతారామాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనం కోసం భక్తులు తండోపతండాలుగా తరలిరావడంతో ఆలయాల వద్ద చాంతాడంత బారులు కనిపించాయి. గోవాడ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఎండీ సన్యాసినాయుడు, కార్మిక సంఘం నేత భాస్కరరావు తదితరులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

బుచ్చెయ్యపేటలోని వడ్డాది గిరిజాంబ గిరిపై కొలువైన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు అంగర శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు గిరి ప్రదక్షిణ చేశారు. వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలతో కొండచుట్టూ ప్రదక్షిణ నిర్వహించారు.

మాడుగుల వేంకటేశ్వరస్వామి, మిగతా ఆలయాల్లో శ్రీరంగనాథుని అవతారంలో స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చారు. పలు ఆలయాల్లో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కేజేపురం జంక్షన్‌లో గల కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్తర ముఖంగా స్వామి వారిని కొలువుంచి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రాపేటి రామకొండరావు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవతామూర్తి విగ్రహాలకు గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. దీంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

దేవరాపల్లి మండల కేంద్రంతో పాటు మారేపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. దేవరాపల్లిలో చంద్రమౌళి నాగేశ్వరరావు శర్మ, చైతన్య, మారేపల్లిలో శ్రీనాథ శ్రీనివాసరావు పూజలు జరిపించారు.

గొలుగొండ, చీడిగుమ్మల రామాలయంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు దీంతో గ్రామస్థులు రాములవారిని దర్శించుకున్నారు. అలాగే కృష్ణాదేవిపేట, ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, నాగాపురం గ్రామాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులు రామాలయంలో సత్యనారాయణస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక నాయకులు భీమిరెడ్డి సత్యనారాయణ, కృష్ణ, కామిరెడ్డి గోవింద్, వెంకటేశ్వరరావు పూజల్లో పాల్గొన్నారు. మాకవరపాలెం మండలంలోని పలు దేవాలయాల్లో ముక్కోటి ఏకాదశి పూజలు నిర్వహించారు. గిడుతూరు గ్రామంలోని రామాలయంలో వేంకటేశ్వరస్వామి వ్రతాలు ఏర్పాటు చేశారు. ఈ వ్రతాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజాము నుంచి కలశ స్థాపనతో పాటు కుంకుమ పూజలు నిర్వహించారు. అలాగే మాకవరపాలెం నుంచి తామరం వేంకటేశ్వరస్వామి దేవాలయం వరకు నగర సంకీర్తన కార్యక్రమం చేపట్టారు. నారాయణరాజుపేట గ్రామంలో మేలుకొలుపు కార్యక్రమం ద్వారా గ్రామంలో తెల్లవారు జాము నుంచి రామాలయంలో పూజలు నిర్వహించి భజనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ఆలయ కమిటీ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.





బుచ్చెయ్యపేట: వడ్డాది గిరిజాంబ గిరిపై కొలువైన వేంకటేశ్వరస్వామి... స్వామివారి దర్శనానికి గిరిజాంబ గిరిపైకి పాదయాత్రగా వెళ్తున్న భక్తులు







మాడుగుల దేవాలయంలో పూజల కోసం బారులు తీరిన భక్తులు... మాకవరపాలెం మండలం గిడుతూరు రామాలయంలో ప్రత్యేక పూజలు

పశు పోషకుల ప్రోత్సాహానికి ప్రత్యేక చర్యలు

▸▸ చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



అంట్లపాలెంలో పశువుల షెడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

రోలుగుంట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): పశు పోషకులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నదని చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పేర్కొన్నారు. మండలంలోని అంట్లపాలెం గ్రామంలో శుక్రవారం ప్రభుత్వ రాయితీతో నూతనంగా రైతులు నిర్మించిన పశువుల షెడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు అండగా నిలిచేందుకు, పాడిని మరింత ప్రోత్సహించేందుకు 90 శాతం రాయితీతో పశువుల షెడ్లను ప్రభుత్వం మంజూరు చేస్తున్నదన్నారు. అర్హత కలిగి ప్రతీ పాడి రైతుకు అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే అంట్లపాలెంలో అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని పరిశీలించి మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం అర్ల నుంచి పిత్రిగెడ్డ వరకు రూ.4 కోట్లతో నిర్మించే రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగమ్మ, ఎంపీడీవో నాగేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు గుములూరు చంద్రమౌళి, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు పంచాడ చంద్ర, నాయకులు బంటు చిరంజీవి, సుర్ల రామకృష్ణ, కోలిపల్లి ఈశ్వరరావు, పిట్ల బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

రావికమతంలో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

రావికమతం: మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు శుక్రవారం భూమి పూజ, ప్రారంభోత్సవాలు చేశారు. చీమలపాడు పంచాయతీ శివారు జెడ్.జోగుంపేట బీటీ రోడ్డు నుంచి కొండశిఖర గ్రామం నేరేడు బంద గిరిజన గ్రామానికి రూ.2.5 కోట్లతో నిర్మించే తారు రోడ్డు పనులను ప్రారంభించారు. అలాగే అలాగే జెడ్.జోగుంపేట నుంచి అజయ్‌పురం వరకు నిర్మించే సీసీ రోడ్డును పరిశీలించి, గ్రామం వరకూ పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం చేయాలని ,ఇందుకు అవసరమైన నిధులు మరో రూ.75 లక్షలు మంజూరు చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం దొండపూడి, మత్స్యవానిపాలెం, గర్నికం గ్రామాలలో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఏఈ ఉమామహేశ్వర్రుడు, టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్.కొండనాయుడు, నాయకులు కె.గోవిందరావు, బి.శ్రీను, జి.నానిబాబు పాల్గొన్నారు.

సర్వీస్ ప్రొవైడర్ మేళాలో 200 దరఖాస్తులు



సర్వీస్ ప్రొవైడర్ మేళాలో దరఖాస్తులు అందిస్తున్న చేతివృత్తుల పనివారు

నర్సీపట్నం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ కార్యాలయంలో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహించిన సర్వీస్ ప్రొవైడర్ మేళాలో 200 మంది దరఖాస్తులు చేసుకున్నారు. శుక్రవారం చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన మెప్మా పీడీ ఎన్.సరోజిని, కమిషనర్ సురేంద్ర మేళాని నిర్వహించారు. ఎలక్ట్రీషన్, ప్లంబర్, ఏసీ, ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్ మెకానిక్‌లు, బ్యూటీషన్, బార్బర్ సేవలు ఆన్‌లైన్ ద్వారా ప్రజలకు సేవలు అందుబాటులో ఉంచుతామని ఈ సందర్భంగా మెప్మా పీడీ సరోజిని తెలిపారు. దీనివల్ల చేతి వృత్తి పని మీద ఆధారపడి జీవిస్తున్న వారికి విస్తృత అవకాశాలు కల్పించడానికి అవకాశం ఉంటుందన్నారు. తద్వారా వారికి జీవనోపాధి మెరుగుపడుతుందన్నారు. సర్వీస్ ప్రొవైడర్ మేళాలో వచ్చిన దరఖాస్తులు పరిశీలించి పేర్లు ఆన్‌లైన్ చేస్తామని తెలిపారు. వీరందరికీ ప్రత్యేకంగా వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తామని తెలిపారు. మొదటి మూడు నెలలకు సబ్‌స్క్రిప్షన్ ఫీజు కింద రూ.4500 బ్యాంకులో జమ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎంసీ వరలక్ష్మి, గవిరెడ్డి వెంకటరమణ, బోళం సతీశ్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజానికి సహకరించాలి

చీడికాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని మాడుగుల ఎక్సైజ్ సీఐ ప్రసాద్ కోరారు. మండలంలోని తురువోలు గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం డ్రగ్స్, సారా నిర్మూలనపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్, సారా వ్యాపారాలు చేసేవారిపై పీడీ యాక్ట్ ప్రకారం చర్యలు తప్పవని ఈ సందర్భంగా సీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ మట్టా అప్పారావు, ఉప సర్పంచ్ పీటీ.బాబు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

తాగునీటి పథకాల నిర్వహణ మెరుగుపర్చండి

▸▸ జిల్లా పరిషత్ సీఈవో నారాయణమూర్తి

▸▸ చోడవరం, రోలుగుంట మండలాల్లో పర్యటన

చోడవరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తాగునీటి పథకాల నిర్వహణను మరింత మెరుగుపర్చాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) పి.నారాయణమూర్తి ఆదేశించారు. మండలంలోని శుక్రవారం ఆయన పర్యటించారు. వెంకన్నపాలెం, జన్నవరం, గౌరీపట్నం ప్రాంతాల్లోని మంచినీటి పథకాలను పరిశీలించి, వాటి నిర్వహణలోని లోటుపాట్లు, ఇతర సమస్యల గురించి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో, ఈవోపీఆర్‌డీ, ఇతర మండల శాఖ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ పర్యటనలో సీఈవో వెంట ఎంపీడీవో పీఎస్‌జే అంజనేయులు, ఈవోపీఆర్‌డీ మహేశ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వేణుగోపాల్, ఎంపీపీ గాడి కాసు, వైస్ ఎంపీపీ బైన ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.



చోడవరం: జన్నవరం నీటి పథకం వద్ద అధికారులతో మాట్లాడుతున్న సీఈవో

తగునీటి సమస్య తలెత్తకుండా చూడండి: సీఈవో

రోలుగుంట: గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా తగిన నివారణ చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈఓ నారాయణమూర్తి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని రోలుగుంట, జానకిరాంపురం సీపీడబ్ల్యూ స్కీంను పరిశీలించారు. పథకం పనితీరుపై ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీడీవోతో సమీక్షించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే తగిన ప్రణాళికలను తయారు చేయాలని ఆదేశించారు. ఫ్లోరైడ్ గ్రామాలకు నీటి కొరత లేకుండా చూడాలని సూచించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి ఎంపీడీవో నాగేశ్వరరావు, ఇతర శాఖల అధికారులతో సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ సూర్యనారాయణ, ఏఈ వెంకటరాజు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

అతిసార బాధిత విద్యార్థులకు డీఈవో పరామర్శ

కోలుకుంటున్న విద్యార్థినులు.. 12 మందిలో నలుగురు డిశ్చార్జి

నర్సీపట్నం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వేములపూడి కేజీబీవీ విద్యార్థినులు అతిసార నుంచి కోలుకుంటున్నారు. ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత విద్యార్థినులను శుక్రవారం డీఈవో గిడ్డి.అప్పారావునాయుడు, డిప్యూటీ డీఎంహెచ్ డాక్టర్ జ్యోతి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రవికుమార్, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రశాంతి కేజీబీవీ, వేములపూడి పీహెచ్‌సీని సందర్శించారు. వేములపూడి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న నలుగురు విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చికిత్స పొందుతున్న 12 మంది విద్యార్థుల్లో నలుగుర్ని డిశ్చార్జి చేశారు. మిగిలిన విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి కూడా నిలకడగానే ఉందని అధికారులు చెప్పారు. ఒక విద్యార్థినికి ఇతర ఆరోగ్య సమస్యలు ఉండటంతో కేజీహెచ్‌కి తరలించి వైద్యం అందిస్తున్నారు. అనంతరం డీఈవో అప్పారావునాయుడు మాట్లాడుతూ విద్యార్థినులు ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందన్నారు. పండగకు ఇంటికి వెళ్లిన తర్వాత కూడా వైద్య సిబ్బంది పర్యవేక్షణ ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కేజీబీవీలో తాగునీరు వినియోగం మానేశామని, బయట నుంచి తీసుకొచ్చిన మంచినీరు మరగబెట్టి ఇస్తున్నామని తెలిపారు. కోలుకుంటున్న విద్యార్థినులను తల్లిదండ్రులు వచ్చి ఇంటికి తీసుకువెళుతున్నారు.



ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినితో మాట్లాడుతున్న డీఈవో

కాగా, ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పి.షియాజ్‌ఖాన్ శుక్రవారం పరామర్శించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని ఆరోగ్యంపై అక్కడున్న సిబ్బందికి ఫోన్ చేసి ఆరా తీశారు.

విద్యా సంస్థల్లో సంక్రాంతి సంబరాలు

కె.కోటపాడు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యా సంస్థలలో సంక్రాంతి సంబరాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సంబరాల్లో అయ్యన్న విద్యా సంస్థల విద్యార్థులు ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. పాఠశాల ప్రాంగణమంతా సంబరాలతో కళకళలాడింది. పల్లెలో జరిగే సంక్రాంతి పండగ వాతావరణాన్ని ఇక్కడ కనిపించింది. విద్యార్థులు, ఉపాధ్యాయుల సంప్రదాయ వస్త్రధారణతో తెలుగుదనం ఉట్టిపడింది. స్కూల్ ప్రాంగణంలో వేసిన 'పల్లెటూరు గుడిసె' సెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ గుడిసెలో ఉపాధ్యాయినులు మట్టి పాత్రలో పాలు పొంగించి పరమాన్నం వెండి వడ్డించారు. విద్యార్థుల హరిదాసుల వేషధారణ చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, ఉపాధ్యాయులు సామూహికంగా జానపద గేయాలను ఆలపించి నృత్యాలు చేశారు. కార్యక్రమంలో అయ్యన్న విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఖాశీం, డైరెక్టర్ నూర్జహన్, ప్రిన్సిపాల్ సుమతి పాల్గొన్నారు.



అయ్యన్న విద్యా సంస్థల్లో వేసిన సంక్రాంతి గెడిసె

మాడుగులలో...

మాడుగుల: మండల కేంద్రంలో శ్రీవిజ్ఞాన్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో రంగవల్లులు వేశారు. విద్యార్థులంతా సంక్రాంతి ఆవశ్యకత తెలియజేసే వేషధారణలతో ఆకట్టుకొన్నారు. కార్యక్రమానికి మాజీ ఎంపీపీ పుప్పాల అప్పలరాజు, భారత నిర్మానసేన సభ్యులు మహేశ్ హాజరయ్యారు.

గోవాడలో షుగర్స్ కార్మికుల ఆందోళన

▸▸ వేతనాల కోసం ఎండీ ఛాంబర్‌లో బైఠాయింపు



గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో ఎండీ ఛాంబరులో బైఠాయించిన కార్మికులు

చోడవరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వేతన, ఇతర బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ గోవాడ షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు శుక్రవారం ఎండీ ఛాంబరులో బైఠాయించారు. సంక్రాంతి పండగలోగా బకాయిలు చెల్లిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ గుర్తింపు కార్మిక సంఘం నాయకుడు భాస్కరరావు ఆధ్వర్యంలో ఎండీ ఛాంబరులో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఎండీ సన్యాసినాయుడును కార్మికులు తమ వేతన బకాయిలపై గతంలో ఇచ్చిన హామీని అమలు చేయాలని పట్టుబట్టారు. వేతన బకాయిలు చెల్లించేంత వరకూ ఆందోళన విరమించేది లేదంటూ ఆందోళన కొనసాగిస్తున్నారు. వారికి నచ్చజెప్పేందుకు ఎండీ సన్యాసినాయుడు ప్రయత్నాలు చేపట్టారు. వేతనాల సంగతి తేలేవరకూ ఆందోళన విరమించేది లేదని కార్మికులు స్పష్టం చేశారు.

మాకవరపాలెం పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో విచారణ

మాకవరపాలెం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మాకవరపాలెం పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో రవికుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఈ పీహెచ్‌సీలో పనిచేస్తున్న ఒక ఉద్యోగి, అప్పటి అధికారి పార్టీకి సంబంధించి ఎన్నికల ప్రచారం చేసినట్టు కొంత మంది సిబ్బంది ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం విచారణ నిమిత్తం ఆయన వైద్యాధికారి గదిలో ఉద్యోగిని పిలిచి మాట్లాడారు. సుమారు గంట పాటు ఈ విచారణ జరిగింది. అప్పటిలోనే ఆ అధికారిపై విచారణ చేపట్టినా, కలెక్టర్‌కు ఫిర్యాదు రావడంతో మళ్లీ విచారణ చేసినట్టు తెలిసింది. తెలిస్తుంది. విచారణపై డీఎంహెచ్‌వోను విలేకరులు ప్రశ్నించగా సమాధానం దాటవేశారు.

ఇంటర్వ్యూ

నిర్దేశిత ధరలకు ఎరువులు విక్రయించకపోతే చర్యలు

-ఎస్.విజయలక్ష్మి, ఏవో, రోలుగుంట



పురుగుల మందులను నిర్దేశిత ధరలకు మించి విక్రయిస్తే వ్యాపారులపై చర్యలు తప్పవు. కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలి. ధాన్యం అమ్మిన 48 గంటల్లోగా రైతుల ఖాతాల్లోనే సొమ్ము జమ చేస్తాం.

ప్ర: పురుగుల మందుల ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తూ రసీదు కూడా ఇవ్వడం లేదు. దీనిపై మీరేం చర్యలు తీసుకుంటున్నారు?

జ: నిర్దేశిత ధరలకు మించి ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు. కొనుగోలు చేసిన ప్రతీ రైతుకు రసీదు ఇవ్వాలిందే. రైతులు కూడా అడిగి బిల్లు తీసుకోవాలి.

ప్ర: ధాన్యం కొనుగోలు ఎలా జరుగుతుంది?

జ: మండలంలో 16 సచివాలయాలకు సంబంధించి రోలుగుంట పీఏసీఎస్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశాం. ఖాళీ సంచుల కొరత కూడా లేదు. తేమ శాతం 17 శాతంలోపు ఉంటే చాలు. ధాన్యం అమ్మిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో సొమ్ము జమవుతుంది.

ప్ర: పంటల బీమాపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారా..?

జ: ప్రకృతి వైపరీత్యాలతో రైతులు నష్టపోకుండా పీఎం ఫసల్ బీమా, వాతావరణ బీమాపై అవగాహన కల్పిస్తున్నాం. ఈ రబీ నుంచి రైతులే వ్యక్తిగతంగా బీమా చెల్లించుకోవాలి. ప్రభుత్వం 75 శాతం రాయితీ, రైతులు 25 శాతం చెల్లిస్తే పంటలకు బీమా వర్తిస్తుంది.

ప్ర: 19వ విడత పీఎం కిసాన్ సొమ్ము రావాలంటే ఏం చేయాలి?

జ: 18వ విడత పీఎం కిసాన్ పొందిన రైతులంతా 19వ విడత సొమ్ము పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకుంటే ఒక యునిక్ ఐడీని ప్రభుత్వం కేటాయిస్తుంది. ఈ నెలలోనే ఈ ప్రక్రియ ప్రారంభమవుతుంది.

ప్ర: పీఎం కిసాన్ సొమ్ము జమ కాలేదని చాలా మంది రైతులు చెబుతున్నారు?

జ: ఇప్పటివరకు 18 విడదల కింద కేంద్ర ప్రభుత్వ జమ చేసింది. ఈ కేవైసీ అవ్వక చాలా మంది రైతుల ఖాతాల్లో జమకాలేదు. దీనికోసం ఆర్‌ఎస్‌కే, మీసేవా కేంద్రాల ద్వారా ఈకేవైసీ చేయించుకోవడానికి ఏర్పాట్లు చేశాం. చేయించుకుంటే వెంటనే ఖాతాల్లో సొమ్ము జమవుతుంది.

-రోలుగుంట

మంచాల మోడల్ స్కూల్‌కు జాతీయ స్థాయి గుర్తింపు

చీడికాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో సెంటర్ ఫర్ సైంటిఫిక్ రీసర్చ్ అండ్ ఎన్విరాల్‌మెంట్ డెవలప్‌మెంట్ న్యూఢిల్లీ వారు నిర్వహించే గ్రీన్ స్కూల్ ఆడిట్‌లో చీడికాడ మండలంలోని మంచాల మోడల్ స్కూల్‌కు రెండోసారి గుర్తింపు లభించింది. 2024-25 సంవత్సరానికిగాను పాఠశాలలో అనుసరిస్తున్న సుస్థిర, పర్యావరణహిత కార్యక్రమాలకు గుర్తింపుగా వరుసగా రెండోసారి జాతీయ స్థాయి గ్రీన్ స్కూల్ సర్టిఫికెట్‌కు ఎంపికైంది. రాష్ట్ర స్థాయిలో 16 పాఠశాలలను ఎంపికచేయగా, అందులో విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల నుంచి మంచాల మెడల్‌స్కూల్ ఏకైక పాఠశాలగా ఎంపికవడం విశేషం. ఫిబ్రవరి 4వ తేదిన న్యూ ఢిల్లీలో జరిగే అవార్డుల ప్రదాన కార్యక్రమంలో మంచాల పాఠశాలకు అవార్డును అందజేయనున్నారు. ఈ మేరకు పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు, స్కూల్ కమిటీ ప్రతినిధులు ఆనందం వ్యక్తం చేశారు.

నాయుడుబాబుకు కన్నీటి వీడ్కోలు

అంత్యక్రియలు నిర్వహించిన అన్న

నర్సీపట్నం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతి తొక్కిసలాటలో మృతి చెందిన నాయుడుబాబుకి శుక్రవారం కన్నీటి వీడ్కోలు పలికారు. అతనికి అన్న బీవీ రమణ అంత్యక్రియలు నిర్వహించారు. తిరుపతిలో శ్రీవారి వైకుంఠ ఏకాదశి దర్శనం టోకెన్లు జారీ కౌంటర్ వద్ద బుధవారం రాత్రి జరిగిన తొక్కిసలాటలో పెదబొడ్డేపల్లి బీసీ కాలనీకి చెందిన బొడ్డేటి నాయుడుబాబు మృతి చెందిన విషయం తెలిసిందే. గురువారం సాయత్రం తిరుపతి నుంచి ప్రత్యేక అంబులెన్స్‌లో మృతదేహాన్ని పెదబొడ్డేపల్లి తరలించారు. శుక్రవారం ఉదయానికి అంబులెన్స్‌పెదబొడ్డేపల్లి చేరుకుంది. మృతిని అన్న, విశ్రాంత ఎంఈవో బీవీ రమణ కుమారుడు రఘు అమెరికా నుంచి పినతండ్రి కడసారి చూపు కోసం హుటాహుటిన బయలుదేరి వచ్చారు. చిన్నాన్న మృతదేహాన్ని చూసిన రఘు కన్నీరుమున్నీరుగా విలపించారు. భార్య మణికుమారి, కుమార్తె సునీత, బంధువులు దుఃఖసాగరంలో మునిగిపోయారు.

యాచకులకు దుప్పట్ల పంపిణీ

నర్సీపట్నం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వరస్వామి గుడి సమీపంలో తిరుపతికి చెందిన పీపుల్ చారిటీ దాతల సహకారంతో సాన్ చారిటీ ఆధ్వర్యంలో యాచకులకు సీఐ గోవిందరావు చేతుల మీదుగా శుక్రవారం దుప్పట్లు పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో సాన్ చారిటీ ఫౌండర్ సూరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు.


కొయ్యూరులో వృథాగా దర్శనమిస్తున్న అల్లూరి కళా క్షేత్రం


సిమెంట్ వేయడంతో ధుమ్ముతో నిండిన ప్రధాన హాలు


చెత్తాచెదారంతో నిండిన మరో గది

మన్యం వీరుని గుర్తులపై నిర్లక్ష్యం నీడ

- ఆలనా పాలన లేని అల్లూరి కళాక్షేత్రం
- నిరుపయోగంగా భవనం

బ్రిటిష్ పాలకులకు సింహ స్వప్నమై నిలిచిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటం చరిత్రాత్మకం. అడవి బిడ్డల్లో పౌరుషాగ్ని రగిలించి వారిని స్వాతంత్ర్యం పోరాటంలో మమేకం చేసిన రథసారథి ఆయన. ఆదివాసీల ఆక్రందనలు, అణచివేతలకు చలించిపోయిన మానవతామూర్తిగా.. వారి విముక్తికి రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యానికి ఎదురొడ్డి తృణప్రాయంగా ప్రాణాలర్పించి యోధుడిగా నిలిచారు. అలాంటి వీరుడు నడయాడిన నేలపై గుర్తులను పదిలం చేయాలి. కానీ, నిర్లక్ష్యం వెంటాడుతోంది.

కొయ్యూరు, జనవరి 10: కొయ్యూరులో అల్లూరి స్మారక కళామందిరం భవనం వృథాగా మారింది. మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటం, ఆశయాలను తెలిపేలా ఈ స్మారక మందిరం నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలో 2007లో అప్పటి భద్రాచలం ఎంపీ మిడియం బాబూరావు పార్లమెంట్ అభివృద్ధి నిధులు రూ. 26 లక్షలతో అల్లూరి కళాక్షేత్రంనకు భవన నిర్మాణాలు చేశారు. ఈ భవనంలో అల్లూరి పోరాట చరిత్రతో కూడిన చిత్రపటాలు ఏర్పాటు చేసి మ్యూజియంగా తయారు చేయాలనే సదుద్దేశంతో ముందుకు సాగారు. 2011 నాటికి భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. అయితే నాటి నుంచి భవన నిర్మాణ ఆశయానికి తగినట్టుగా మ్యూజియంగా తీర్చి దిద్దేలా చర్యలు నేటికి లేవు. దీంతో ఈ భవనాన్ని మధ్య పెద్ద హాలును గడిచిన నాలుగేళ్ల క్రితం వరకు సిమెంట్ గొడౌన్‌గా వినియోగించారు. ఒక వైపు చిన్నహాలుంచాల్సిన గదిలో కొంత కాలం గ్రంథాలయం నిర్వహించారు. మరోవైపునున్న హాలు, గదిని ప్రస్తుతం వ్యవసాయశాఖ కార్యాలయంగా వినియోగిస్తున్నారు. సిమెంట్ గొడౌన్‌గా వినియోగించిన హాలు సిమెంట్ పూర్తిగా తీసినా శుభ్రం చేయలేదు. గ్రంథాలయానికి సొంత భవనం సమకూరటంతో వారు వినియోగించిన చిన్నహాలు గది చెత్త కుప్పలు పేరుకు పోయి ఉన్నాయి. మిగిలిన హాలును వ్యవసాయశాఖ గొడౌన్‌గా, కార్యాలయ నిర్వహణకు వినియోగిస్తున్నారు. దీంతో ఈ భవనం ఆలన, పాలనా లేకుండా చీకటి కార్యకలాపాలకు నిలయంగా మారింది. విప్లవ వీరుడు అల్లూరి నడయాడిన ప్రాంతమైన రాజేంద్రపాలెంలో ఆయన పోరాట స్మారక చిహ్నాలు కళాఖండాల రూపంలో ఏర్పాటు చేసి భావితరాలకు తెలుకునేందుకు వీలుగా పెద్ద మ్యూజియం ఏర్పాటుకు వీలుగా నాటి ఎంపీ నిధులు కేటాయిస్తే ఆయన ఆశయానికి తగినట్టుగా చర్యలు లేకపోవటంపై అల్లూరి అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిరిజన సాంస్కృతిక, పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో అల్లూరి స్మారక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్టుగా ప్రకటనలు గుప్పించటం మినహాయిస్తే రూ. లక్షలు వెచ్చించి మహోన్నత ఆశయంతో భవన సదుపాయం కల్పించిన మాజీ ఎంపీ ఆశయానికి తగినట్టుగా చర్యలు చేపట్టక పోవటంపై సర్వత్రా విమర్శలు చోటు చేసుకుంటున్నాయి. వీటి అభివృద్ధిపై అధికారులు స్పందించాల్సి ఉంది.

తాగునీటి సమస్యపై ఆందోళన


పెదగూడలో ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

ముంచంగిపుట్టు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెదగూడ పంచాయతీ కేంద్రంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. గ్రామ సచివాలయం ఎదుట ఖాళీ బిందెలతో బైఠాయించి, నీటి సమస్య తీర్చాలని నినాదాలు చేశారు. బోరు ఏర్పాటు చేసి, మోటారు బిగించకపోవడంతో నీటి సరఫరా జరగడంలేదని అన్నారు. పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందించడంలేదని ఆరోపించారు. గ్రామంలో ఉన్న మరో బావి పాడై, ఇబ్బంది ఎదుర్కొంటున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన పంచాయతీ కార్యదర్శి సింహాచలం బోరు బావిలో మోటార్ బిగింపు పనులను చేయించారు. దీంతో గిరిజనులు ఆందోళన విరమించారు.

చందాలు వేసుకుని రహదారి నిర్మాణం


ఎక్స్‌కవేటర్‌తో రహదారి నిర్మిస్తున్న గిరిజనులు

గూడెంకొత్తవీధి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలికొండ పంచాయతీ సువ్వపల్లి గిరిజనులు చందాలువేసుకుని ఎక్స్‌కవేటర్‌తో రహదారి నిర్మాణం చేపట్టారు. గ్రామంలో 30 పీవీటీజీ గిరిజనులు నివాసముంటున్నారు. ప్రధాన రహదారి నుంచి గ్రామానికి కాలిబాట మాత్రమే ఉన్నది. దీంతో గ్రామానికి అంబులెన్సు, వాహనాలు వచ్చే పరిస్థితిలేదు. రహదారి సదుపాయం కల్పించాలని గత ఐదేళ్లగా అధికారులు, పాలకులకు కోరినా ఫలితంలేకుండాపోయింది. దీంతో గ్రామ గిరిజనులు ఒక్కొక్కరు రూ.వెయ్యి చొప్పున చందావేసుకుని శుక్రవారం సుమారు నాలుగు కిలోమీటర్ల రహదారిని నిర్మించుకున్నారు. ఇకనైనా తమ గ్రామానికి ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు కోరారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు


వాలీబాల్ విజేతలకు ట్రోఫీ అందిస్తున్న ప్రిన్సిపాల్ విజయభారతి, అధ్యాపకులు

చింతపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి పర్యవేక్షణలో విద్యార్థులు, గ్రామ ప్రజలు సాంప్రదాయ దుస్తులు ధరించి భోగిమంటలను ఆచరించారు. వివిధ వంటకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వాలీబాల్, ముగ్గుల పోటీలు నిర్వహించారు. వాలీబాట్ పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన కొత్తవలస క్రీడాకారులకు రూ.ఐదువేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన డిగ్రీ కళాశాల విద్యార్థులు రూ.మూడు వేలు అందజేశారు. అలాగే ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులందజేశారు. పీడీ కె. శివరామ్ కుమార్, అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసపాత్రుడు, రమణ, లీలాపావని, జ గదీశ్ బాబు, గ్రంథాలయ అధికారి జగత్‌రాయ్ పాల్గొన్నారు.

మంచు ముసుగు


ముంచంగిపుట్టులో కమ్ముకున్న పొగ మంచు

ముంచంగిపుట్టు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలో చలి తీవ్రత పెరిగింది. శుక్రవారం మండల కేంద్రంలో 10 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం 10 గంటల వరకు పొగ మంచు కమ్ముకోవడంతో పట్టపగలు లైట్ల వెలుగులో వాహన రాకపోకలు జరిగాయి. చలికి ప్రజలు గజగజలాడిపోతున్నారు. పిల్లలు, వృద్ధులు, ఆస్మా రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

కూటమి పాలనలో మారుమూల గ్రామాలకు రహదారులు

- విజయనగరం ఆర్టీసీ రీజినల్ ఛైర్మెన్ సివేరి దొన్నుదొర


గుమ్మ-చీడివలస రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న దొన్నుదొర

అనంతగిరి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మారుమూల గిరిజన గ్రామాలకు మహర్దశ పట్టిందని టీడీపీ అరకు నియోజకవర్గ ఇన్‌చార్జి, విజయనగరం ఆర్టీసీ రీజినల్ ఛైర్మన్ సీవేరి దొన్నుదొర అన్నారు. మండలంలోని గుమ్మ నుంచి చీడివలస వరకు 14 కిలో మీటర్ల గాను రూ.10 కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ రహదారి నిర్మాణంతో 8 గ్రామాలకు మేలు జరుగుతుందన్నారు. డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు సాగుతున్నట్టు ఆయన తెలిపారు. గత ప్రభుత్వంలో మారుమూల గ్రామాల అభివృద్ధిపై దృష్టిపెట్టకపోవడం గిరిజనులు ఐదేళ్లపాటు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారని, కూటమి ప్రభుత్వం రాకతో మంచిరోజులు వచ్చాయన్నారు. ఓ వైపు అభివృద్ధి, మరో వైపు సంక్షేమంగా దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, మొదటి ప్రాధాన్యతగా రోడ్లపై దృష్టిసారించినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలోని టీడీపీ మండల అధ్యక్షుడు ఎ.బుజ్జిబాబు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు చిట్టం మురళీ, సుబ్బారావు, భీమన్న, గంగరాజు, చిట్టిబాబు, పాల్గొన్నారు.

'హంస' క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ ప్రభావతి, నాయకులు

చింతపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) నూతన సంవత్సర క్యాలెండర్‌ని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.ప్రభావతి శుక్రవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ వైద్యశాఖ ఉద్యోగులకు ఈ క్యాలెండర్ ఎంతగానో ఉపయోగపడుతుందని, హెల్త్ ఉద్యోగలకు అవరమైన సమచారం ఉందన్నారు. ఈకార్యక్రమంలో హంస చింతపల్లి తా లూకా యూనియన్ అధ్యక్షుడు కుడుముల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు జాన్సన్, కార్యవర్గ సభ్యులు ప్రకాశ్, జీకేవీధి సబ్ యూనిట్ అధికారి కన్నబాబు పాల్గొన్నారు.

24 నుంచి ఏబీవీపీ రాష్ట్ర మహాసభలు


మహాసభల పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐ దీనబందు, తదితరులు

పాడేరురూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో ఈ నెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను స్థానిక సీఐ జీనబందు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏబీవీజీ జిల్లా కన్వీనర్ పి.సూర్యారావు మాట్లాడుతూ విశాఖలో జరిగే రాష్ట్ర మహాసభలలో రాష్ట్ర విద్యారంగ సమస్యలపై తీర్మానాలు ప్రవేశపెడతామన్నారు. జిల్లాల్లో ఉన్న విద్యారంగ సమస్యలపై చర్చిస్తామన్నారు.

పెదపాడులో వైద్య సేవలు


వైద్య తనిఖీ చేస్తున్న డాక్టర్ రాంబాబు

డుంబ్రిగుడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో వ్యాధులు సోకితే వెంటనే వైద్య సిబ్బందికి సమాచారమందించాలని డుంబ్రిగుడ పీహెచ్‌సీ వైద్యాధికారి రాంబాబు సూచించారు. మండలంలోని పోతంగి పంచాయతీ పెదపాడు గ్రామంలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించారు. వ్యాధులతో బాధపడుతున్న వారి ఇళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. నలుగురికి రక్త పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. శీతాకాలం కావడంతో దగ్గు, జలుబు తదితర లక్షణాలుంటాయన్నారు. వీటిపై జాగ్రత్తగా ఉండాలన్నారు.

ఘాట్ రోడ్డులో నిలిచిన ఆర్టీసీ బస్సు

- మూడు గంటల పాటు ప్రయాణికుల నిరీక్షణ



లంకపాకలు వద్ద నిలిచిపోయిన బస్సు

గూడెంకొత్త వీధి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం ఆర్టీసీ డిపోనకు చెందిన సీలేరు వెళ్లే బస్సు సాంకేతిక సమస్యతో లంకపాకలు గ్రామ సమీపంలో నిలిచి పోయింది. దీంతో మూడు గంటల పాటు ప్రయాణికులు ప్రత్యామ్నాయ బస్సు కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. శుక్రవారం ఉదయం నర్సీపట్నం నుంచి సీలేరుకు ఆర్టీసీ బస్సు బయలు దేరింది. సుమారు పది గంటల సమయంలో లంకపాకలు సమీపానికి వచ్చేసరికి ఇంజన్‌లో సాంకేతిక సమస్యతో ఈ బస్సు నిలిచిపోయింది. దీంతో ప్రయాణికులను మధ్యాహ్నం ఒంటి గంటలకు నర్సీపట్నం నుంచి వచ్చిన మరో బస్సులో గమ్యస్థానాలకు తరలించారు. ఇకనైనా కండీషన్ కలిగిన బస్సులను పంపించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కమిటీలు కృషి


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

చింతపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్య వివాహాలు నియంత్రించేందుకు కమిటీ సభ్యులు సమర్థంగా పనిచేయాలని స్థానిక ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి చైల్డ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందరంగా ఆయన మాట్లాడుతూ, బాల్యవివాహాల వల్ల కలిగే నష్టాలను మండల, గ్రామ స్థాయి కమిటీ సభ్యులు ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. బాల్యవివాహాల వల్ల బాలికల ఆరోగ్యానికి తీవ్ర నష్టం కలుగుతుందని, మాత, శిశు మరణాలు సంభవిస్తాయన్నారు. గ్రామాల్లోబాల్య వివాహాలు చేస్తే అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం, ఆశ, మహిళా కానిస్టేబుళ్ల ద్వారా సమాచారం తెలుసుకునే విధంగా సమాచార వ్యవస్థను ఏర్పాటు చేసుకోసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో జీవీ రమణ, ఎంఈవో పీవీవీవీ ప్రసాద్, ఏసీడీపీవో రామలక్ష్మి పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల్లో పారిశుధ్యంపై దృష్టి పెట్టాలి

అనంతగిరి: పర్యాటక ప్రాంతాలను ఈనెల 12తేదీన న్యాయమూర్తులు పర్యటించనున్న నేపథ్యంలో ఆయా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఎంపీడీవో ఏవీవీ కుమార్ స్థానిక పంచాయతీ , సచివాలయాల సిబ్బందికి ఆదేశించారు. బొర్రా, ములియగుడ,డముకు, కాశీపట్నం, భీసుపురం, అనంతగిరి పర్యాటక ప్రాంతాల్లో కార్యదర్శులు ప్రత్యేక దృష్టిపెట్టాలని, పారిశుధ్య కార్మికుల ద్వారా చెత్తాచెదారం లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

ఆలయాల్లో ఘనంగా వైకుంఠ ఏకాదశి పూజలు

అరకులోయ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని శుక్ర వారం స్థానిక వెంకటేశ్వర ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున విచ్చేశారు. ఉదయంనుంచి బారులు తీరారు. స్వామివారికి ప్రధాన అర్చకుడు ఆధ్వర్యంలో పూజలు చేశారు.

సీలేరు: స్థానిక మేజర్ పంచాయతీ వెంకటేశ్వర స్వామి, రామాలయాల్లో ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో ప్రధాన ద్వారం మూసి వేసి ఉత్తర ద్వారం తెరిశారు. దీంతో భక్తులు ఈ ద్వారం ద్వారా ఆలయంలోకి ప్రవేశించి పూజలు చేశారు. వెంకటేశ్వర స్వామి ఆలయంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


అరకులోయలో వెంకటేశ్వరునికి పూజలు


పాల్గొన్న భక్తులు


సీలేరు: అలంకరణలో స్వామివారు

ఆస్పత్రిలోనే ప్రసవం పొందాలి


గర్భిణీని పరీక్షిస్తున్న స్త్రీ వైద్యనిపుణురాలు రోజరాణి

చింతపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు విధిగా ఆస్పత్రుల్లోనే ప్రసవం పొందేలా ఏర్పాట్లు చేసుకోవాలని స్త్రీవైద్యనిపుణులు రోజరాణి అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రధాన మంత్రి సురక్షిత మంత్రిత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 190మంది గర్భిణులకు స్త్రీ వైద్యనిపుణులు వైద్యపరీక్షలు, అల్ట్రాసౌండ్ స్కానింగ్‌లు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు తొమ్మిది నెలల్లో ఒక్కసారైన స్కానింగ్ చేయించుకోవాలన్నారు. దీని వల్ల ఇబ్బందులుంటే ముందుగా గుర్తించవచ్చునన్నారు. గర్భిణులు క్రమంగా ఆరోగ్య తనిఖీలు చేయించుకుంటూ పోషకాహారం తీసుకోవాలన్నారు. గర్భిణులు ప్రసవ సమయానికి పది రోజులు ముందుగా చింతపల్లి గర్భిణుల వసతి గృహంలో చేరాలన్నారు. గర్భిణులకు వసతి గృహంలో పూర్తి స్థాయి సదుపాయాలు, సౌకర్యాలు అందుబాటులోనున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ జి. ప్రభావతి, వైద్యులు పాల్గొన్నారు.

ఆదివాసీ చట్టాలు అమలు చేయాలని వినతి


కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు వినతిపత్రమిస్తున్న దండకారణ్య సమితి నాయకులు

పాడేరురూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ 5వ షెడ్యూల్ ప్రకారం ఆదివాసీలకు రక్షణగా ఉన్న 1959, 1/70, పెసా, 96 తదితర ముఖ్య చట్టాలకు అనుగుణంగా రూపొందించిన జీవోలను ప్రభుత్వ యంత్రాంగం చిత్తశుద్ధితో అమలు చేయాలని దండకారణ్య విమోచన, ఉద్యోగ, విద్యార్థి సమితి నాయకులు కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్‌ను కలిసి ఆదివాసీ చట్టాలపై రెవెన్యూ శాఖాధికారుల నిర్లక్ష్యం, గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థుల మరణాలు తదితర అంశాలపై వివరించారు. అనంతరం వారు మాట్లాడుతూ, జీవో 3 వల్ల అనేక మంది ఆదివాసీలు ఉపాధ్యాయులు అయ్యారన్నారు. ఈ ఫలాలను అందుకొనే సమయంలో జీవోను సుప్రీం కోర్టు రద్దు చేసిందన్నారు. అలాగే, 1959, 1/70, పెసా వంటి స్వయం పాలన చట్టాలను అమలు చేయకపోవడం వల్ల బినామీలు, ఆదివాసీయేతర వలసవాదులు పెరిగిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లాలని కలెక్టర్‌ను కోరామన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో నె లకొన్న సమస్యల పరిష్కారానికి చేపట్టాలని కోరామన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌వో సలహాదారులు చెండా కేశవరావు, కేంద్ర కమిటీ ప్రతినిధి ఎస్.మాణిక్యం, వి.బాలకృష్ణ, కె.ఆనందరావు, ఎం.రాజుబాబు, జి.ధనుంజయ్, కె.శేఖర్, కె.కాసులమ్మ, కె.కాంతారావు, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాఫీ పండ్ల సేకరణ లక్ష్యాలు పూర్తి చేయాలి

- ఐటీడీఏ ఏపీవో వెంకటేశ్వరరావు


మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

చింతపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కాఫీ పండ్ల సేకరణ లక్ష్యాలను లైజన్ వర్కర్లు, ఎఫ్‌సీలు పూర్తి చేయాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి (పీవీటీజీ) ఎం. వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎకో పల్పింగ్ యూనిట్ సమావేశమందిరంలో కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి మండలాల కాఫీ ఉద్యోగులు, అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈఏడాది మ్యాక్స్ ద్వారా రెండు వేల మెట్రిక్ ట న్నుల కాఫీ పండ్లు సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు చెప్పారు. ఇప్పటి వరకు 550 మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించామని, జనవరి రెండో వారం వచ్చినా, 50శాతం లక్ష్యం పూర్తికాలేదన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఆరుగురు సరెండర్

గిరిజన రైతులు నాణ్యమైన కాఫీ పండ్లను సేకరించి మ్యాక్స్‌కి అందజేసేలా అవగాహన కల్పించాలన్నారు. లైజన్ వర్కర్లుకు ఇచ్చిన లక్ష్యంతో ఈనెల 20తేదీ నాటికి 40శాతం పూర్తి చేయాలన్నారు. లేకుంటే లైనన్ వర్కర్లు, ఎఫ్‌సీలకు జీతాలు నిలిపివేస్తామన్నారు. ఇప్పటికే కొయ్యూరు, జీకేవీధి, చింతపల్లి మండలాల్లో విధులకు గైర్హాజరవుతున్న ఆరుగురు లైజన్ వర్కర్లను ఐటీడీఏకి సరెండర్ చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాఫీ ప్రాజెక్టు అసిస్టెంట్ డైరెక్టర్ జి. అప్పలనాయుడు, జీకేవీధి హెచ్‌వో అరుణకుమారి, కొయ్యూరు, చింతపల్లి ఏఈవోలు రమణ, ధర్మారాయ్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం : ఎస్ఐ

ముంచంగిపుట్టు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతీ ఒ క్కరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్ఐ రామకృష్ణ అన్నారు. జోలాపుట్టు పంచాయతీ జప్పా రు గ్రామంలో శుక్రవారం సైబ ర్ నేరాలు, గంజాయి వలన కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లో పరిచయమైన నమ్మరాదని, అపరిచి ఫోన్ కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.యువత గంజాయి సాగుకు, అక్రమ రవాణాలకు దూరంగా ఉండాలని చెప్పారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై దృష్టిశారించాలని సూచించారు.

ఆదివాసీ విద్యార్థులకు ఉచిత కోచింగ్ అభినందనీయం


ఆదివాసీ ఫౌండేషన్ వార్షికోత్సవాలను ప్రారంభిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

ముంచంగిపుట్టు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పేద గిరిజన విద్యార్థులకు పలు రకాల పోటీ పరీక్షలకు సంబంధించి ఉచిత కోచింగ్ అందిస్తున్న ఆదివాసీ విద్యా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని స్థానిక ఎస్ఐ రామకృష్ణ అన్నా రు. ఆదివాసీ విద్యా ఫౌండేషన్ ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం స్థానిక కల్యాణమండపంలో కేక్ కటింగ్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎస్ఐ మాట్లాడుతూ ఫౌండేషన్‌లో శిక్షణ పొందిన యువత మంచి స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, యువత పాల్గొన్నారు.

దాడిపై పండ్ల వ్యాపారి ఫిర్యాదు

పాడేరురూరల్, జనవరి 10(ఆంధ్రజ్యోతి): ఆర్అండ్‌బీ రహదారి పక్కన పండ్ల వ్యాపారం చేసుకుంటున్న తనపై దాడి చేసి, సెల్ ఫోన్ ధ్వంసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సీఐ డి.దీనబంధుకు బాధిత మహిళ వంతాల సింహాచలం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మండలంలోని వంట్లమామిడి గ్రామానికి చెందిన తాను డ్వాక్రా గ్రూపులో రుణం పొంది, సీతాఫలాలు, పైనాపిల్, రాంఫలం తదితర పండ్లను కొనుగోలు చేసి ప్రధాన రహదారి పక్కన విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నానన్నారు. అయితే, అదే గ్రామానికి చెందిన జనపరెడ్డి శ్రీహర్ష అనే వ్యక్తి రోడ్డు పక్కన పండ్లు విక్రయించ వద్దంటూ దాడి చేశారని ఆరోపించారు. సీఐ దీనబంధు వద్ద ప్రస్తావించగా, విచారణ చేపట్టి చర్యలు చేపడతామన్నారు.

'సీపీఐ నేత మల్లయ్య సేవలు చిరస్మరణీయం'

కొయ్యూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సీపీఐని గ్రామ స్థాయి నుంచి బలోపే తానికి నేత బన్నిన మల్లయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకట రమణ పేర్కొన్నారు. శుక్రవారం అంతాడ పంచాయతీ కొత్తపల్లిలో మల్లయ్య 18వ వర్ధంతిని నేత ఉల్లి సత్యనారాయణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, నేతలు ఇరవాడ దేముడు, వియ్యపు నానాజీ, చంద్రరావు, ఎంపీటీసీ సభ్యులు సత్యవేణి, అనకాపల్లి జిల్లా రైతు సంఘ అధ్యక్షుడు మేకా సత్యనారాయణ మాదల సత్యనారాయణ పాల్గొన్నారు.


పరవాడలో సీతారాముల ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు


కశింకోటలో వెంకటేశ్వరస్వామి దర్శనానికి విచ్చేసిన భక్తులు


దేమునిగుమ్మంలో శ్రీవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్సీ బుద్ద

ఇల వైకుంఠం

- ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిచ్చిన దేవదేవుడు
- కనులారా వీక్షించి తరించిన భక్తజనం
- వేకువజాము నుంచి ఆలయాలు కిటకిట
- విస్తృత ఏర్పాట్లు చేపట్టిన నిర్వాహకులు


అనకాపల్లి పట్టణంలోని దేమునిగుమ్మం ఆలయంలో ఉత్సవమూర్తులు


దేమునిగుమ్మం ఆలయం వద్ద స్వామి దర్శనానికి క్యూలైన్లలో వేచి ఉన్న భక్తజనం


ప్రత్యేక అలంకరణలో గాంధీనగరంలోని వెంకటేశ్వరస్వామి

అనకాపల్లి టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల ప్రజలు శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయాలు కోలాహలంగా మారాయి. అనకాపల్లి పట్టణంలోని దేమునిగుమ్మం వేంకటేశ్వర ఆలయంలో స్వామివారికి వేకువజాము రెండున్నర గంటలకు విశేష అలంకరణ చేపట్టారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అప్పటికే పెద్ద సంఖ్యలో క్యూలో వేచి ఉన్నారు. రాత్రి ఎనిమిది గంటల వరకు భక్తుల తాకిడి తగ్గలేదు. మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, భోగలింగేశ్వర ఆలయ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణలతో పాటు పలువురు కూటమి నాయకులు దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన వీరికి ఉత్సవ కమిటీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావు సత్కరించారు. పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ ఎత్తున బందోబస్తు నిర్వహించారు. గాంధీనగరంలోని వేంకటేశ్వర ఆలయంలో ఉత్తరద్వార దర్శనానికి భక్తులు పోటెత్తారు. ప్రధానార్చకులు రేజేటి చక్రవర్తి తొలుత శ్రీవారిని విశేషంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనాలు కల్పించారు. అలాగే, సుంకరమెట్ట జంక్షన్‌లోని సత్యనారాయణ స్వామి ఆలయంలో ఈ వేడుకను నేత్రపర్వంగా నిర్వహించారు. గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, 84వ వార్డు కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లి, వార్డు టీడీపీ ఇన్‌చార్జి మాదంశెట్టి నీలబాబు స్వామివారిని దర్శించుకున్నారు. వీరికి ఆలయ చైర్మన్ బొడ్డేడ మురళీ సత్కరించారు. అదేవిధంగా చినరామస్వామి కోవెలలోని రామాలయం, దిబ్బవీధిలోని నృసింహస్వామి ఆలయం, దేమునిగుమ్మంలోని రామాలయాల్లో ఉత్తరద్వారం నుంచి స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయాల నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఇదిలావుంటే, వైకుంఠ ఏకాదశి సందర్భంగా దేమునిగుమ్మంలోని వేంకటేశ్వర స్వామికి నూకాంబిక ఆలయ మాజీ డైరెక్టర్ బుద్ద శ్రీనివాసరావు దంపతులు 21 కిలోల లడ్డూను సమర్పించారు. ప్రత్యేకంగా దీనిని తయారు చేయించి, ఉత్సవ కమిటీ చైర్మన్ బొలిశెట్టి శ్రీనివాసరావుకు అందజేశారు.

తుమ్మపాల : మండలంలోని దిబ్బపాలెంలో గల సుదర్శన గిరిపై కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. తొలుత స్వామిని అంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సర్పంచ్ పీలా ఉషా, నాయకులు పీలా అప్పా రావు, బొడ్డపాటి రాజారావు, కాండ్రేగుల రవి తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : ముక్కోటి ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం కశింకోటలోని ధ్యాన మందిరం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున స్వామిని పంచామృతాలతో అభిషేకించారు. విశేషంగా అలంకరించిన అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

పరవాడ : సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరవాడలో సీతారాముల విగ్రహాలను పల్లకీలో ఉంచి గ్రామ వీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగించారు. అనంతరం రామాలయంలో ఉత్తరద్వారం నుంచి స్వామిని దర్శించుకున్నారు. ఫౌండేషన్ సభ్యులు వి.సూరిబాబు, పైలా పోతునాయుడు, రామారావు, సూరిబాబు, రెడ్డి శ్రీను, అచ్చింనాయుడు, కె.వాణి, చిట్టమ్మ, కె.సత్యవతి, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

బెల్ట్ షాపులు నిర్వహణ చట్ట విరుద్ధం

జి. మల్లికార్జునరావు, సీఐ, పరవాడ



పారిశ్రామిక ప్రాంతం పరవాడలో నిత్యం ప్రశాంతమైన వాతావరణం నెలకొనేందుకు కృషిచేస్తున్నాం. ఇందుకు ప్రజలు కూడా చక్కని సహకారాన్ని అందిస్తున్నారు. ఇదే స్ఫూర్తితో గంజాయి విక్రయాల నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణకు మరింత ముందుకు సాగుతాం.

ప్రశ్న : గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం బెల్టుషాపులు ఉన్నాయి. వీటి నిర్మూలనకు చేపట్టబోయే చర్యలేమిటి?

జవాబు : బెల్ట్‌షాపులు నిర్వహణ చట్ట విరుద్ధం. తరచూ మా సిబ్బందితో కలిసి దాడులు చేస్తున్నాం. నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తున్నాం. అలాగే పరవాడ, లంకెలపాలెం, దేశపాత్రునిపాలెం ప్రాంతాల్లో గల దాబాల్లో కూడా మద్యం అమ్మకాలు జరపకుండా పటిష్ట చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నాం.

ప్రశ్న : గంజాయి విక్రయాల కట్టడికి ఏ వ్యూహంతో వెళుతున్నారు?

జవాబు : ఫార్మాసిటీలో పనిచేసే ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఎక్కువగా గంజాయి సేవిస్తున్నట్టు మా దృష్టికి వచ్చింది. వాళ్లు ఎక్కడెక్కడ నివాసాలు ఉంటున్నారో ఆయా ప్రాంతాల్లో సిబ్బందితో కలిసి సోదాలు చేపడుతున్నాం. ఎక్కడ గంజాయి అమ్మకాలు జరుపుతున్నారో ఆ సమాచారాన్ని పబ్లిక్ మా దృష్టికి తీసుకువస్తే తక్షణమే కేసులు నమోదు చేస్తాం. గంజాయి కట్టడికి పకడ్బందీగా చర్యలు చేపడుతున్నాం.

ప్రశ్న : పెండింగ్ కేసులు పురోగతి ఎలా ఉంది ?

జవాబు : ప్రస్తుతం పెండింగ్ కేసులు పురోగతి బాగానే ఉంది. 400 కేసులు పెండింగ్‌లో ఉండగా నేను వచ్చిన నాలుగు నెలల్లో సుమారు 170 కేసులు ఛేదించాం. మిగతా కేసులు పురోగతిపై దృష్టి పెట్టాం. వాటిని కూడా సాధ్యమైనంత తొందరల్లోనే పూర్తి చేస్తాం.

ప్రశ్న : ప్రధాన రహదారులకు ఇరువైపులా తరచూ వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు, వాటిపై దృష్టి సారించారా...?

జవాబు : పరవాడ మండల పరిషత్ జంక్షన్, ఊటగెడ్డ జంక్షన్, రాంకీ కమర్షియల్ హబ్ పరిసర ప్రాంతాల్లో రహదారికి ఇరువైపులా వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. రవాణాశాఖ అధికారులతో కలిసి సంబంధిత డ్రైవర్లకు అవగాహన కల్పించాం. అయినప్పటికీ వాహనాలు పార్కింగ్ చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

14న అయ్యప్ప ఆలయంలో మకర సంక్రాంతి ఉత్సవాలు


బ్రోచర్‌ను ఆవిష్కరించిన అయ్యప్ప భక్తులు

అనకాపల్లి టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గౌరీ పంచాయతన ఆలయం ఆవరణలో గల అయ్యప్ప ఆలయంలో ఈనెల 14న స్వామివారి మకర జ్యోతి దర్శనం వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం ఉత్సవ కమిటీ చైర్మన్ పీలా నాని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నామన్నారు. సంక్రాంతి రోజున ఆలయ ప్రధానార్చకులు పొందూరు సూర్యనారాయణ శాస్త్రి వేదమంత్రాల మధ్య అయ్యప్ప మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నామన్నారు. స్వామివారి ఆభరణాలను పురవీధుల గుండా ఊరేగిస్తామన్నారు. సాయంత్రం మకరజ్యోతి దర్శనం కల్పించనున్నామని వివరించారు. అనంతరం ఆలయ ప్రధాన గురుస్వామి మద్దాల నారాయణరావు ఆధ్వర్యంలో మకరజ్యోతి ప్రజ్వలన పడిపూజ ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాల్సిందిగా ఆయన కోరారు.

సమస్యల పరిష్కారానికి పారిశుధ్య కార్మికులు ధర్నా

అనకాపల్లి టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికులకు గత సమ్మె కాలంలో జరిగిన ఒప్పందాలను ప్రభుత్వం అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. శుక్రవారం జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మున్సిపల్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ అనకాపల్లి జోన్‌లో పనిచేస్తున్న పర్మినెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికులకు సమ్మె కాలపు ఒప్పందాలపై ఇచ్చిన హామీ మేరకు జీవోలను వెంటనే జారీ చేయాలని కోరారు. పర్మినెంట్ కార్మికులకు నాలుగేళ్ల నుంచి రావాల్సిన సరెండర్, ప్రమోషన్ స్కేల్, ఇంక్రిమెంట్లు, హెల్త్‌కార్డులు ఇవ్వాలన్నారు. గత నాలుగేళ్లగా కార్మికులకు యూనిఫాం, చెప్పులు, నూనె, సబ్బులు తదితర పరికరాలు అందలేదని, నాణ్యత కలిగిన పనిముట్లు లేక వారు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, క్లాప్ డ్రైవర్లు, లోడర్స్‌కు రూ. 15వేలు లోపు ఇస్తున్న కనీస వేతనం రూ.26 వేలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యర్రంశెట్టి ఏసురాజు, గోవింద్, ఓంశివ, శివకుమార్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

నూనె గింజల సాగుపై రైతులకు శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్ర ప్రతినిధి

కశింకోట, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాళ్లపాలెం రైతు సేవా కేంద్రంలో నూనె గింజల సాగుపై శుక్రవారం కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ హరిరావు, వి.ప్రసాద్ మాట్లాడుతూ నువ్వు పంట సాగుల్లో సమగ్ర యాజమాన్య చర్యల ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. కేంద్ర ప్రభుత్వం నూనె గింజల అభివృద్ధి పథకంలో భాగంగా మండలంలోని నూనె గింజల పంటల్లో దిగుబడి పెంచడమే లక్ష్యంగా ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. నూనెగింజల పంటల్లో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో భాస్వరాన్ని ఎకరాకు 50కిలోలు ఆఖరి దుక్కిలో వాడడం ద్వారా నూనె శాతాన్ని పెంచుకోవచ్చని వివరించారు. విత్తనానికి ట్రైకో డెర్మావిరిడితో శుద్ధి చేయడం, ట్రైకో డెర్మావిరిడి పొడిని ఎకరాకు రెండు కిలోల చొప్పున ఆఖరి దుక్కిలో పశువుల గెత్తంతో కలిసి చెల్లడం ద్వారా వచ్చే వేరు కుళ్ళు, కాండం కుళ్ళు తెగుళ్ళను అరికట్టవచ్చని తెలియజేశారు. విత్తిన 48 గంటల్లోగా ఎకరాకు ఒక లీటరు పెండిమితాలిన్ కలుపు మందును పిచికారీ చేయడం ద్వారా వెడల్పుకు కలుపు మొక్కలను రాకుండా చేయవచ్చని సూచించారు. సరైన మొక్కల సాంద్రతను పాటించడం, ఒక్కసారైనా కలుపు తీయడం, కనీసం రెండు సార్లు తేలికపాటి తడి ఇవ్వడం ద్వారా ఇప్పుడు వస్తున్న దిగుబడిని రెట్టింపు చేసే అవకాశం ఉందని రైతులకు వివరించారు. అనంతరం శారదా రకం నువ్వుల విత్తనం రైతులకు అందించారు. మండల వ్యవసాయాధికారి ఎం.స్వప్న, టీడీపీ మండల అధ్యక్షుడు కె.మురళీ, బీజేపీ మండల అధ్యక్షుడు ఎ.అప్పారావు, కె.గోవింద, తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి పండుగలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



అనకాపల్లి రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సందర్భంగా జిల్లాలోని ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఎస్పీ తుహిన్ సిన్హా శుక్రవారం హెచ్చరించారు. పండుగ సమయంలో కోడిపందాలు, పేకాట, జూద క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కోడిపందాల నిర్వాహకులు, కోడి కత్తెల తయారీదారులు, పేకాట శిబిరాల నిర్వాహకులపై బైండోవర్ కేసులు నమోదు చేసి, నిఘా కొనసాగిస్తున్నామన్నారు. అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకునేందుకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ బృందాలు ఏర్పాటు చేశామని తెలిపారు. డ్రోన్ కెమెరాలు, సీక్రెట్ బృందాలతో 24 గంటల ప్రత్యేక నిఘా ఉంటుందని వివరించారు. ప్రధాన గ్రామాలు, మండలాల సరిహద్దుల్లో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిబంధనలను ఎవరూ అతిక్రమించ వద్దని స్పష్టం చేశారు. అందరూ సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా కుటుంబంతో ఆనందంగా జరుపుకోవాలని ఆయన సూచించారు.

రాజుపాలెంలో రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి ఫోల్స్ ఏర్పాటుపై అభ్యంతరం

- పనులు ఆపేది లేదని స్థానికులకు తేల్చి చెప్పిన అధికారులు
- ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకు వెళతామని వెనుదిరిగిన గ్రామస్థులు


ఫ్లైఓవర్ నిర్మించబోయే స్థలాన్ని పరిశీలిస్తున్న స్థానికులు

అనకాపల్లి రూరల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 80వ వార్డు పరిధి రాజుపాలెం సర్వే నంబరు 151, 152లలో రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణానికి ఆ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన ఫోల్స్‌ను శుక్రవారం స్థానికులు పరిశీలించారు. చెరువు గర్భం, శ్మశానవాటికను కప్పేసే విధంగా రైల్వే అధికారులు మ్యాప్‌ను రూపొందిస్తూ ఫోల్స్ వేయడం తగదని పలువురు గ్రామస్థులు పేర్కొన్నారు. వాటిని మినహాయిస్తూ ప్లాన్ రూపొందించాలని స్థానికులు రైల్వే అధికారులకు సూచించారు. దీంతో వారు రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు రైల్వే పై వంతెన నిర్మాణానికి ప్లాన్ మంజూరు చేశారని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి నిధులు మంజూరు చేసిందని స్థానికులకు రైల్వే అధికారులు తెలిపారు. పనులు నిలపబోమని తేల్చి చెప్పడంతో అక్కడి నుంచి స్థానికులు వెనుదిరిగారు. ఈ సమస్యను స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని స్థానికులు తెలిపారు. ఫోల్స్ పరిశీలన కార్యక్రమంలో టీడీపీ నాయకులు సిరసపల్లి సన్యాసిరావు, కశిరెడ్డి సత్యనారాయణ, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి విలువిద్యకు క్రీడాకారులు ఎంపిక


రాష్ట్ర స్థాయి విలువిద్య పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

పరవాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఆర్చరీ సంఘం ఆధ్వర్యంలో ఇక్కడి సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి విలువిద్య పోటీలు ఘనంగా ముగిశాయి. రికర్వ్, కాంపౌండ్, ఇండియన్ రౌండ్ విభాగాల్లో పోటీలు జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి సుమారు యాభై మందికి పైగా క్రీడాకారులు పోటీల్లో ఉత్సాహంగా తలపడ్డారు. ప్రతిభ చూపిన క్రీడాకారిణులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు ఉమ్మడి విశాఖ జిల్లా ఆర్చరీ ప్రధాన కార్యదర్శి కె.నిశాంత్ తెలిపారు. ఎంపికైన వారిలో దేశాయ్, లలిత్‌సాయి, యశ్వంత్ నాయుడు, తేజేశ్వర్, పుర్వాడ్ రాథోడ్, నాభ్యా ప్రభాత్, గణేష్ మణిరత్నం, హర్షవర్ధన్, సాయి మనస్వి, వైష్ణవి ఉన్నారు. వీరిని జిల్లా ఆర్చరీ సంఘం ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కోశాధికారి బి.భాస్కర్ అభినందించారు. కోచ్‌లు పి.గోవింద్, శివ కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ


తుమ్మపాలలో బీభత్సం సృష్టించిన లారీ

తుమ్మపాల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి మండలం తుమ్మపాలలో శుక్రవారం ఓ లారీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొని స్థానికులకు భయాందోళనకు గురి చేసింది. చోడవరం నియోజకవర్గం నుంచి కర్రల లోడుతో తెలంగాణలోని భద్రాచలం ఐటీసీ పేపరు మిల్లుకు వెళుతున్న లారీ.. తుమ్మపాల మెయిన్‌రోడ్డులో ఎడమ పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని, వైర్లను తెంపుకుంటూ వంద మీటర్ల దూరం వెళ్లి ఆగింది. ఈ సమయంలో రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్న జనం భయంతో పరుగులు తీశారు. వెంటనే స్పందించిన స్థానిక యువకులు విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించారు. కొద్ది సేపట్లో సిబ్బంది వచ్చి విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా ఏఈ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొనడంతో ఇక్కడ 15 ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. తమ శాఖకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి లారీ యజమానికి నోటీసులు జారీ చేస్తామని చెప్పారు.

పాఠశాలల్లో సంక్రాంతి సంబరాలు

కొత్తూరు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి సంబరాలను పలు పాఠశాలల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనకాపల్లి మండలం కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాలలో ఈ వేడుకలు మిన్నంటాయి. ఇంటర్, డిగ్రీ, ఒకేషనల్, పీజీ విద్యార్థినులు ముగ్గుల పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని అందమైన ముగ్గులు వేశారు. కళాశాల ప్రాంగణంలో భోగి మంట వేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు, వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ అధికారులు సూరిబాబు, నాయుడు, మహిళా సాధికారత విభాగం కో-ఆర్డినేటర్ సామ్రాజ్యం, సూపరింటిండెంట్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మపాల : అనకాపల్లి పట్టణం రింగురోడ్డులో గల గురజాడ పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి హాజరయ్యారు. పాఠశాల ప్రాంగణాన్ని పచ్చనితోరణాలు, గాలిపటాలు, చెరకుగడలతో అందంగా అలంకరించారు. భోగి మంట వేయడంతో విద్యార్థుల ఆనందానికి అవధులు లేవు. ప్రిన్సిపాల్ కోరిబిల్లి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కశింకోట :స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు గాలిపటాలు ఎగురవేడం, రంగవల్లుల పోటీలు నిర్వహించారు. స్కూల్ రెవరెన్ కెనన్‌జాన్, డైరెక్టర్ బత్తుల నోబుల్ కుమార్, కరస్పాండెంట్ బత్తుల అనురాధ, ప్రిన్సిపాల్ రూపనంది, షాజాది, అకడమిక్ ఇన్‌చార్జి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలను సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. విద్యార్థులు హరిదాసు, గంగిరెద్దు వేషంలో అలరించారు. బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి, డైరెక్టర్ ఉదయ నాగశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక ప్రతిభ విద్యాలయంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో అలరించారు. వివిధ వేషధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు. కరస్పాండెంట్ ఆదిరెడ్డి రమణ, ప్రిన్సిపాల్ ఆన్సీ జోసోఫ్, డైరెక్టర్లు శరత్ తేజ, విష్ణుతేజ పాల్గొన్నారు.

వెన్నెలపాలెంలో స్వచ్ఛతే సేవ


పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న దృశ్యం

పరవాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెన్నెలపాలెంలో శుక్రవారం స్వచ్ఛతే సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పంచాయతీ విస్తరణాధికారి కె.ధర్మారావు పర్యవేక్షణలో పలువురు శ్మశానవాటిక వద్ద పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్థులకు సూచించారు. చెత్తను రహదారులు, వీధుల్లో పారబోయవద్దని, పంచాయతీ ఏర్పాటు చేసిన కుండీల్లో వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెన్నెల సన్యాసిరావు, పంచాయతీ కార్యదర్శి కె.భారతి, సచివాలయ సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'అధ్యయనం ద్వారానే మంచి రచనలు సాధ్యం'

అనకాపల్లి టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : అధ్యయనం ద్వారానే మంచి రచనలు చేయడం సాధ్యమని ప్రముఖ కథా రచయిత రంగబాబు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో శుక్రవారం సాహితీ సమావేశాన్ని నిర్వహించారు. తొలుత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ప్రముఖ సాహితీవేత్త, కార్టూనిస్ట్ మళ్ల భువనేశ్వరరావుకు నివాళులర్పించింది. గత నెల 28, 29 తేదీల్లో విజయవాడలో జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభల విశేషాలను కవులు మాధవీ సనారా, కోరాడ అప్పలరాజు వివరించారు. ఈ కార్యక్రమంలో యిమ్మిడిశెట్టి చక్రపాణి, అమరజ్యోతి, రాజా గణేష్, కర్రి మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

తుమ్మపాల, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోన్ మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. శుక్రవారం ఇక్కడి యూనియన్ సభ్యులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. కార్మికులకు నాలుగు నెలలుగా జీతాలు అందక అవస్థలు పడుతున్నారన్నారు. నాయకులు రవికుమార్, నరసింహమూర్తి, అప్పలరాజు, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా తిరువీధి ఉత్సవం

» అష్ట వాహనాల్లో ఊరేగిన స్వామి, అమ్మవార్లు





ఉపమాకలో అష్ట వాహనాలతో శ్రీవారి తిరువీధి సేవ (ఇన్‌సెట్‌లో) పుణ్యకోటి వాహనంపై శ్రీరంగనాథుడి అలంకరణలో దర్శనమిస్తున్న స్వామివారు

నక్కపల్లి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా శుక్రవారం సాయంత్రం ఉపమాకలో వేంకటేశ్వరస్వామివారి తిరువీధి సేవ కన్నుల పండువగా జరిగింది. ఒకేసారి అష్ట వాహనాలపై తిరువీధి సేవ జరగడం ఉపమాక క్షేత్రం ప్రత్యేత. పుణ్యకోటి వాహనంపై ఉభయదేవేరులతో శ్రీరంగనాథునిగా శ్రీవారు, వెనుక రాజాధిరాజ వాహనంపై గోదాదేవి అమ్మవారి ఉత్సవ మూర్తి భక్తులకు దర్శనమిచ్చారు. ఆ వెనుక పొన్న వాహనంపై రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, గజ వాహనంపై ప్రాకార పెరుమాళ్లు, అశ్వవాహనంపై శయన పెరుమాళ్లు, హంస వాహనంపై బాలకృష్ణుడు, ఆంజనేయ వాహనంపై సీతారాములు, చిన్నపల్లకీలో బాలరాముడు ఉత్సవమూర్తులను అలంకరించి మాడవీధుల్లో మంగళవాద్యాలు, భక్తుల గోవిందనామస్మరణ మధ్య తిరువీధి సేవ నిర్వహించారు. . ఆలయ అధికారులు, అర్చకులు, గ్రామ పెద్దలు, శ్రీవారి సేవకులు పాల్గొన్నారు.

15న బొజ్జన్నకొండ వద్ద బౌద్ధమేళా



బుద్ధుడి చిత్రపటానికి పూలమాల వేస్తున్న బల్లా నాగభూషణం

అనకాపల్లి టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ బౌద్ధ క్షేత్రం బొజ్జన్న కొండ వద్ద ఈ నెల 15వ తేదీన కనుమ పండుగ రోజున జరిగే మహా బౌద్ధ మేళాను విజయవంతం చేయాలని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం పిలుపునిచ్చారు. శుక్రవారం సంస్థ కార్యాలయంలో బుద్ధుడి చిత్రపటానికి పూలమాల వేసి బౌద్ధ మేళా ఆహ్వాన కరపత్రాలను ఆవిష్కరించారు. ఏటా కనుమ పండుగ రోజున జరిగే ఈ మేళాకు దేశ, విదేశాల నుంచి బౌద్ధ సంఘాల ప్రతినిధులు హాజరవుతారన్నారు.

జమిలీ ఎన్నికలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం

» ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ అజశర్మ




సమావేశంలో మాట్లాడుతున్న అజశర్మ

అనకాపల్లి టౌన్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయి నుంచి దేశస్థాయి వరకు చట్టసభలు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న ప్రయత్నాలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ అన్నారు. శుక్రవారం దొడ్డి రామునాయుడు భవన్‌లో సీపీఎం సీనియర్ నేత బాలకృష్ణ ప్రథమ వర్ధంతి సందర్భంగా 'రాజ్యాంగ పరిరక్షణ- జమిలీ ఎన్నికలు' అనే అంశంపై స్మారకోపన్యాసం చేశారు. పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలన్న ఎన్‌డీఏ ప్రభుత్వ ప్రయత్నాలను ప్రజలు అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ చేసే చట్టాలు, రాజ్యాంగ సవరణలు ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ స్ఫూర్తిని బలహీనపరిచేలా ఉండకూడదని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ఆయన గుర్తు చేశారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ, నియంతృత్వానికి దారి తీసే జమిలీ ఎన్నికలను ప్రజలు వ్యతిరేకించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.అప్పలరాజు, ఆర్.శంకరరావు, డి.వెంకన్న, బి.ప్రభావతి, గంటా శ్రీరామ్, బాలకృష్ణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సింహాద్రి రెండో యూనిట్‌లో ఉత్పత్తి పునరుద్ధరణ

పరవాడ, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి ఎన్టీపీసీ విద్యుత్ కేంద్రంలోని 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండో యూనిట్‌లో ఉత్పత్తిని శుక్రవారం పునరుద్ధరించారు. వార్షిక నిర్వహణ పనుల నిమిత్తం ఈ యూనిట్‌ను గత ఏడాది నవంబరులో షట్‌డౌన్ చేశారు. సుమారు రెండు నెలలపాటు యూనిట్‌లోని అన్ని విభాగాల్లో నిర్వహణ, మరమ్మతులు పనులు చేశారు. ప్రస్తుతం ప్లాంట్‌లోని అన్ని (నాలుగు) యూనిట్‌లలో పూర్తిస్థాయిలో విద్యుత్ ఉత్పత్తి జరుగుతున్నదని అధికారులు తెలిపారు.



సింహాచలేశునికి వైకుంఠ శోభ

ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన సింహాచలేశుడు

» భక్తులతో కిక్కిరిసిన సింహాచలం
» ఉత్తర ద్వారంలో దర్శనమిచ్చిన స్వామివారు



అప్పన్నను ఉత్తర ద్వారంలో దర్శించుకుంటున్న అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యేలు గంటా, గణబాబు



తిరువీధిలో అప్పన్నకు పల్లకీ సేవ నిర్వహిస్తున్న అనువంశిక ధర్మకర్త అశోక్ గజపతిరాజు, ఈవో త్రినాథరావు

వంతెన నిర్మించారు.. అప్రోచ్ రోడ్డు మరిచారు

12 ఏళ్లు అయినా అందుబాటులోకి రాని వారధి

» స్థల సేకరణలో అధికారులు విఫలం
» పురాతన వంతెన మీదుగానే రాకపోకలు
» శిథిలావస్థకు చేరడంతో కూలిపోయే ప్రమాదం
» కూటమి ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు వినతి



గవర్ల అనకాపల్లి వద్ద ఆవ కాలువపై 12 ఏళ్ల క్రితం నిర్మించిన వంతెన

మునగపాక, జనవరి 10 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని గవర్ల అనకాపల్లి వద్ద ఆవ కాలువపై పుష్కరకాలం క్రితం నిర్మించిన వంతెన ఇప్పటికీ ప్రజలకు అందుబాటులోకి రాలేదు. అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడమే ఇందుకు కారణమని స్థానికులు చెబుతున్నారు. శిథిలావస్థకు చేరిన బ్రిటీష్ కాలం నాటి వంతెన మీదుగానే రాకపోకలు సాగిస్తుండడంతో ఎప్పుడు కూలిపోతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ రహదారిపై అనకాపల్లి పట్టణ పరిధిలోని నూకాంబిక ఆర్చి వద్ద తోటాడ జంక్షన్ నుంచి పరవాడ వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు వుంది. ఈ మార్గంలో గవర్ల అనకాపల్లి, తోటాడ, పాటిపల్లి, టి.సిరసపల్లి, తాణాం, వెంకటాపురం, భరణికం, రాజుపేట అగ్రహారం, పరవాడ, తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. గవర్ల అనకాపల్లి వద్ద ఆవ కాలువపై ఎప్పుడో బ్రిటీష్ హయాంలో నిర్మించిన వంతెన శిథిలావస్థకు చేరింది. వంతెన ఇరుకుగా వుండడంతో భారీ వాహనాలు ఎదురైతే తప్పుకోవడానికి వీలుకాదు. దీంతో కొత్త వంతెన నిర్మాణానికి 2012లో అప్పటి ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి నిధుల (ఆర్‌డీఎఫ్) నుంచి రూ.1.13 కోట్లు మంజూరు చేసింది. వంతెన పనులకు నాటి ఎమ్మెల్యే యూవీ రమణమూర్తిరాజు శంకుస్థాపన చేశారు. పాత వంతెన పక్కనే కొత్త వంతెన నిర్మాణ పనులు వేగంగా సాగాయి. ఏడాదిలో వంతెన నిర్మాణం పూర్తయ్యింది. కానీ అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి భూ సేకరణ పీటముడిగా మారింది. ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం చాలదంటూ భూమిని ఇవ్వడానికి సదరు రైతు నిరాకరించారు. అంతేకాక భూమిని బలవంతంగా సేకరిస్తారన్న ఉద్దేశంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. తరువాత రెండు ప్రభుత్వాలు మారాయి. 2014లో పంచకర్ల రమేశ్‌బాబు, 2019లో మళ్లీ యూవీ రమణమూర్తి రాజు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. గవర్ల అనకాపల్లి వద్ద ఆవ కాలువపై నిర్మించిన వంతెనకు అప్రోచ్ రోడ్డు వేయించాలని ఆయా గ్రామాల ప్రజలు పలుమార్లు ఎమ్మెల్యేలను కలిసి విజ్ఞప్తి చేశారు. కానీ ఒక్కరు కూడా శ్రద్ధ చూపలేదు.. కొత్త వంతెన ప్రజలకు అందుబాటులోకి రాలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉంది. అనకాపల్లి, ఎలమంచిలి, పెందుర్తి నియోజకవర్గాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుంటారు. ఈ మూడు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి జనసేన పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరు చొరవ తీసుకుని అప్రోచ్ రోడ్డుకు స్థల సమస్యను పరిష్కరించి కొత్త వంతెనను అందుబాటులోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మామిడి తోటలపై తేనెమంచు, తామర పురుగు

» సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యాన శాఖాధికారి ప్రభాకరరావు సూచన



తేనె మంచు పురుగు సోకిన మామిడి పూత

అనకాపల్లి అగ్రికల్చర్ జనవరి 10 (ఆంధ్రజ్యోతి): తేనెమంచు, తామర పురుగుల నివారణకు మామిడి రైతులు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన శాఖ అధికారి జి.ప్రభాకరరావు సూచించారు. శుక్రవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ తేనెమంచు పురుగు ఆశిస్తే పూత నల్లగా మారి రాలిపోతుందని, తామర పురుగు ఆశిస్తే మామిడి ఆకులపై నల్లమచ్చలు ఏర్పడి రాలిపోతాయని చెప్పారు. తేనెమంచు పురుగు, తామర పురుగు నివారణకు పువ్వు మొగ్గ దశలో వుంటే లీటరు నీటికి 0.3 మిల్లీ లీటర్ల ఇమిడా క్లోపిడ్ లేదా 1.5 గ్రాముల చొప్పున ఎసిఫేట్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. బూడిద తెగులు సోకితే లీటరు నీటికి 3 గ్రాముల గంధకం (నీటిలో కరిగేది) లేదా హెక్సాకొనజోల్ 2 మిల్లీ లీటర్లు కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.



తెగుళ్లు సోకిన మామిడి చెట్లకు మందు పిచికారీ చేస్తున్న రైతులు

బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడి అరెస్టు

... 5వ పేజీ తరువాయి

ఫోన్లపై నిఘా పెట్టారు. మరోవైపు మహేశ్ రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు మకాం మారుస్తూ, వేరే వ్యక్తుల ఫోన్ల నుంచి బంధువులకు వాట్సాప్ కాల్స్ చేస్తూ పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతున్నాడు. మహేశ్ ఇటీవల తన పేరుతో సిమ్ తీసుకుని మొబైల్ ఫోన్ వాడుతున్నట్టు పోలీసులు గుర్తించారు. సాంకేతికత సాయంతో పట్టుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ విషయం తెలుసుకున్న మహేశ్ శుక్రవారం బాలికను గ్రామానికి సమీపంలో విడిచిపెట్టి పారిపోతుండగా అనకపల్లి వద్ద పోలీసులు పట్టుకున్నారు.

బాలికను విచారించగా.. మహేశ్ తనను పెళ్లి చేసుకున్నాడని, శారీరకంగా ఒక్కటయ్యామని చెప్పింది. దీంతో నిందితుడిపై పోక్సో చట్టంతోపాటు అత్యాచారం, బాల్య వివాహాల నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేశారు. బాలికను తీసుకెళ్లడానికి సహకరించిన ఆమె పెద్దమ్మ కుమారుడు పరారీలో ఉన్నాడు. మహేశ్ వద్ద నుంచి బైక్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బాలిక తనతోపాటు ఇంటిలో నుంచి 30 తులాల బంగారం తీసుకెళ్లలేదని తమ విచారణలో తేలిందని, ఆ బంగారాన్ని బాలిక పెద్దమ్మ కుమారుడు చోరీ చేసినట్టు నిర్ధారణ అయ్యిందని డీఎస్పీ చెప్పారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి పంపినట్టు తెలిపారు. ఈ కేసును ఛేదించిన సీఐ విస్నింటి రమణ, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు

బాలిక పెద్దమ్మ కుమారుడు కిడ్నాప్‌కు సహకారం

బాలికను కిడ్నాప్ చేసే విషయంలో మహేశ్ ఆమె పెద్దమ్మ కుమారుడు సహరించినట్టు పోలీసులు వెల్లడించారు. మహేశ్‌ను తాను ప్రేమిస్తున్నానని, ఈ విషయం ఇంట్లో తెలియడంతో వేరే వ్యక్తితో పెళ్లి చేయాలని చూస్తున్నారని, తనకు సాయం చేయాలని అతడిని కోరింది. అయితే మీ ఇంటి తాళం ఒకసారి నాకు ఇస్తే సాయం చేస్తానన్నాడు. దీంతో బాలిక తాళం ఇవ్వగా.. ఇంటికి వెళ్లి వచ్చి రూ.70 వేల నగదు, దుస్తులు సమకూర్చి మహేశ్‌తో వెళ్లిపోవడానికి సహకరించాడు. ఈ క్రమంలో ఆ బాలిక ఇంటిలో సుమారు 30 తులాల బంగారు నగలను అతడే తస్కరించాడు. బాలికను మహేశ్ తీసుకెళ్లిపోయిన తరువాత నిత్యం అతనితో కాంటాక్టులో వుంటూ, ఇక్కడ పోలీసుల దర్యాప్తు గురించి తెలియపరుస్తూ వుండేవాడు. దీంతో పోలీసులకు దొరక్కుండా మహేశ్ తప్పించుకునేవాడు.

క్రైం... crime news

రైలు ఢీకొని ఒకరి మృతి

లంకెలపాలెం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి):లంకెలపాలెం రైల్వే క్రాసింగ్ సమీపంలో రైలు ఢీకొన్న ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. దువ్వాడ జీఆర్పీ ఎస్‌ఐ కేటీఆర్ లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతానికి చెందిన యూనస్ షబ్బీర్ ఖాన్ (40) లంకెలపాలెం నుంచి జాతీయ రహదారి వైపు నడుచుకుంటూ వచ్చే క్రమంలో రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద పట్టాలు దాటుతున్నాడు. ఇదే సమయంలో విశాఖ వైపు నుంచి అనకాపల్లి వైపు వెళుతున్న రైలు ఢీకొన్నది. దీంతో సంఘనాస్థలంలోనే మృతిచెందాడు. జీఆర్పీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు.

ఆటో బోల్తా: ఐదుగురికి గాయాలు

గూడెంకొత్తవీధి, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): కొయ్యూరు-పెదవలస ప్రధాన రహదారిలోని బొంతువలస ఘాట్‌లో ఆటో బోల్తా పడి ఐదుగురు గిరిజనులకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు శుక్రవారం మధ్యాహ్నం కొయ్యూరు మండలం నల్లబెల్లి గ్రామానికి చెందిన గెమ్మెలి మోహన్‌రావు, అప్పారావు, నాగేశ్వరరావు, సీదరి సంజీవరావు, కొర్ర అప్పన్న వ్యక్తిగత పని మీద ఆటోలో బూదరాళ్ల గ్రామానికి బయలుదేరారు. బొంతువలస ఘాట్‌లో ఆటో బ్రేకులు ఫెయిల్ కావడంతో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటోలో ఉన్నవారందరూ గాయపడ్డారు. క్షతగాత్రులను ఫీడర్ అంబులెన్స్ ఎంటీ జోరంగి గాంధీ పెదవలస పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించిన అనంతరం చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారికి ఏరియా ఆస్పత్రిలో వైద్యాధికారి ఇందిరా ప్రియాంక చికిత్స అందించారు. క్షతగాత్రుల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు ఆమె తెలిపారు.

398 కిలోల గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్టు

పెదబయలు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి అనకాపల్లి వైపు జీపులో తరలిస్తున్న 398 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ కొల్లి రమణ తెలిపారు. ముందస్తు అందిన సమాచారం మేరకు శుక్రవారం ఉదయం సీకరి పంచాయతీ పన్నెడా జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో బైక్‌పై వస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నామన్నారు. అనంతరం వచ్చిన జీపును తనిఖీ చేయగా.. 398 కిలోల గంజాయి లభించిందన్నారు. ఈ సందర్భంగా తిరుపతిలోనిజ వినాయకనగర్ కాలనీకి చెందిన లాపాక్షి బాబా పకృద్దీన్, అల్లూరి జిల్లా పాడేరు గాంధీనగర్‌కు చెందిన బచ్చల పవన్‌కుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ రమణ తెలిపారు.

ఎనిమిది కిలోల గంజాయితో భార్యాభర్తల అరెస్టు

నాతవరం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్యపురట్ల వద్ద శుక్రవారం 8 కిలోల గంజాయితో భార్యాభర్తలను పోలీసులు పట్టుకున్నారు. తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లా ఎరుకుపల్లి గ్రామానికి చెందిన భార్యాభర్తలు రాథోడ్ తుకారం, రాథోడ్ కమలాబాయి. ఏజెన్సీ ప్రాంతం నుంచి మన్యపురట్ల మీదుగా తునికి ఆటోలో గంజాయిని తీసుకువెళుతున్నారు. మన్యపురట్ల వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా వీరు పారిపోయే ప్రయత్నం చేయడంతో పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ఎనిమిది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేశారు.

ఐదున్నర కిలోల గంజాయితో నలుగురి అరెస్టు

రావికమతం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఐదున్నర కిలోల గంజాయితో నలుగురిని శుక్రవారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ ఎం.రఘువర్మ తెలిపారు. చినపాచిల రహదారిలో రెండు బైకులపై వెళుతున్న నలుగురిని తనిఖీ చేయగా వారి వద్ద గంజాయి దొరికిందన్నారు. ఈ సందర్భంగా గోపాలపట్నంకు చెందిన ఉజ్వల సాయి, చెలిమూరి చరణ్, జనగామకు చెందిన శబరి, హైదరాబాద్‌కు చెందిన కిరణ్‌కుమార్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. రెండు బైక్‌లు, ఐదు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

చెరకు పిప్పితో ఎరువు

... 5వ పేజీ తరువాయి

కొన్ని రంధ్రాలు చేసి, దాని మధ్య భాగం ఖాళీ ఉండేలా ఇటుకలపై అమర్చాలి. డ్రమ్‌లో చెరకు పిప్పి వేసి కింద మంట పెట్టాలి. మంట డ్రమ్ కన్నాల ద్వారా లోపలి చెరకు పిప్పికి తగిలి అది రాజుకుంటుంది. పిప్పి కాలి బూడిద కాక ముందే డ్రమ్‌ను కిందికి దించేసి పైభాగాన మూతపెట్టాలి. లోపల కాలుతున్న పిప్పికి గాలి (ఆక్సిజన్ అందక నెమ్మదిగా ఆరిపోతుంది. కొద్దిగా నీటిని చిలకరిస్తే అది బొగ్గుగా (బయోచార్) మారుతుంది. మంట ఎంతసేపు తగలనివ్వాలన్నది చెరకు పిప్పి పరిమాణం, దానిలోని తేమ శాతం, నాణ్యతపై ఆధారపడి ఉంటుంది. ఏడు కిలోల చెరకు పిప్పి నుంచి సుమారు రెండు కిలోల బయోచార్ (బొగ్గు) లభిస్తుంది. చెరకు పిప్పి బొగ్గు (బయోచార్) భూసారాన్ని పెంచేందుకు, నేలలో తేమను పట్టి ఉంచేందుకు ఉపయోగపడుతుంది. పొలంలో వేసిన ఎరువులను పంట పూర్తిగా ఉపయోగించుకొనేలా సాయపడుతుంది. ముఖ్యంగా ఇందులోని కార్బన్ నేలలోని కార్బన్ శాతం పెరిగేలా చేస్తుంది. గింజలు తీసివేసిన మొక్కజొన్న కండెలు, ఎండిన కొబ్బరి చిప్పలతో కూడా బయోచార్ తయారు చేయొచ్చు. బయోచార్‌పై రైతులకు అవగాహన కల్పించేందుకు శాస్త్రవేత్తలు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నారు. బయోచార్ తయారైన తరువాత ఏ రకం నేలలో ఎంత మోతాదులో వేయాలి, ఫలితాలు ఎలా వస్తాయన్నది త్వరలో రైతులకు వివరిస్తామని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

పర్యావరణానికి మేలు



డాక్టర్ పి.శ్రీదేవి, ఆర్ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త, పంటకోత అనంతర సాంకేతిక ఇంజనీరింగ్ విభాగం

చెరకు పిప్పి, ఎండుటాకులు, ఇతర పంటల వ్యర్థాలను సేంద్రియ ఎరువుగా మార్చేందుకు ఎక్కువ కాలం పడుతుంది. అదే బయోచార్‌గా తయారు చేస్తే వెంటనే నేలకు కర్బనాన్ని అందిస్తుంది. అన్నింటికీ మించి ఇది పర్యావరణానికి మేలు చేస్తుంది. పంటకోత అనంతర సాంకేతిక ఇంజనీరింగ్ విభాగం ఈధిపతి డాక్టర్ పి.వి.కె.జగన్నాథరావు, భూసార శాస్త్రవేత్త డాక్టర్ రామలక్ష్మి, ఇంజనీరింగ్ శాస్త్రవేత్త కుసుమ కూడా బయోచార్ పరిశోధనలు నిర్వహిస్తున్నారు. ఈ మొత్తం ప్రక్రియను నెల రోజుల్లో ప్రమాణీకరిస్తాం.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	102.00
లైవ్ ధర	122.00
విత్ స్కిన్	214.00
స్కిన్ లెస్	224.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524